నేటి కందం- నేటికి అందం

మదరాసు రాష్ట్ర నామము
నదములు మ్రోగంగ తమిళ నాడుగ మార్చన్
ముదమొంద లోకసభ తన
కదమును ముందునకు వేసె కామిత గుణయై !!

(22-11-1968 మద్రాసు రాష్ట్రం పేరును తమిళనాడు గా మార్చడాన్ని లోకసభ ఆమోదించిన రోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

విత్తు శక్తివంతమైతే
పిచ్చి మొక్క విస్తరించు
చీడపీడలెన్నొచ్చినా
చీల్చి వాట్ని కత్తిరించు
అసమర్థత అవినీతి
అహం అవే పాపాలు
అధినేతలు ఎవరైనా
అణగదొక్కే ప్రకోపాలు

-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్: 9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 22-11-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:83 పేజీలు:6 వెల: రూ.1/-

అమ్మను మరువద్దు.. అమ్మ భాషను మరువద్దు ..మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

-లోక్ మంథన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంకయ్య నాయుడు
-శిల్పారావంలో నాలుగు రోజుల పాటు కార్యక్రమాలు
-కుటుంబ వ్యవస్థ పటిష్టతతో సంస్కృతి వికాసం
-భారతీయ మూలలు తెలుసుకునే మహోత్తర కార్యక్రమం

హైదరాబాద్, నవంబర్ 21:అమ్మ భాషకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు. పిల్లలను సున్నితంగా పెంచకుండా చిన్న తనం నుంచే కష్టం అంటే ఏంటో తెలిసేలా పెంచాలని కోరారు. హైదరాబాద్‌లోని శిల్ప రామంలో ఏర్పాటు చేసిన లోక్ మంథన్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థను పటిష్టంగా ఉంచుకోవాలని సూచించారు. పెద్దలను గౌరవించేలా పిల్లలను తయారు చేయాలని అన్నారు.

లోక్ మంథన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభించటం తనకు ఆనందదాయకంగా ఉందని వెంకయ్య అన్నారు.. చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. నేటికీ ప్రకృతితో కలిసి జీవిస్తూ, సామాజిక ప్రధాన జీవన స్రవంతిలో మరుగు పడిన వర్గాలను, మనం నాగరికం అనుకుంటున్న సమాజానికి తిరిగి చేరువ చేసి, నేటి యువతకు నిజమైన ధర్మాన్ని తెలియజేయటమే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

రాయి, రప్ప, చెట్టు, పుట్ట, గాలి, నీరు ఇలా అన్నింటిలోనూ భగవంతుణ్ని చూడగలిగి వ్యవస్థమనది అని అన్నారు. సమస్త మానవాళి అభివృద్ధిని ఆకాంక్షించే వసుధైవ కుటుంబ భావన భారతీయుల సొంతమన అన్నారు. మన సంస్కృతి మీద జరిగిన దాడులతో, , మనదైన సంస్కృతిని దూరం చేసి, అనేక ప్రతికూల భావనలను మన మనసుల్లో నాటాయని వివరించారు మాజీ ఉపరాష్ట్రపతి.. ఈ జాఢ్యాలను వదిలించుకుని, మూలాలను తిరిగి తెలుసుకుని, భారతీయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్ తరాలకు మన ధర్మాన్ని, సంస్కృతిని, సంప్రదాయాలను, భాషను మరింత చేరువ చేయాలని కోరారు. భారత సంస్కృతిని వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. ప్రకృతిని ఎదుర్కోవడం అందరి బాధ్యత అని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఈ కార్యక్రమం శిల్పారామంలో గురువారం నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు జరుగనుంది. 2016లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో లోకమంథన్‌ను వైభవంగా నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో రాష్ట్రంలో నిర్వహిస్తూ వస్తోంది. ఆ రకంగా ఇది నాలుగో లోక్‌మంథన్. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారిగా హైదరాబాద్ అతిథ్యమిస్తున్నది.. రేపు జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

డిసెంబర్ రెండో వారం నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ అయింది. తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు డిసెంబర్ రెండో వారం నుంచి జరుగనున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తి కానున్న తరుణంలో ఈ అసెంబ్లీ సమావేశాలు జరుగబోతున్నాయి. ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలు, రానున్న కాలంలో చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి అసెంబ్లీలో చర్చించడానికి రంగం సిద్ధమవుతోంది. ప్రతిపక్షాలు కూడా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల గురించి నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నాయి.

మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి సంకల్పం

-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

హైదరాబాద్ నవంబర్ 21(ఎక్స్ ప్రెస్ న్యూస్): రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్య మంత్రి సంకల్పంలో భాగంగా మహిళా స్వయం సహాయక బృందాలచే బస్సుల కొనుగోలు, సోలార్ ప్లాంట్ ల ఏర్పాటు, శిల్పా రామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ల ఏర్పాటు పనులు ముమ్మరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలుపై నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, 22 ఇందిరా మహిళ శక్తి భవనాల నిర్మాణం పనులు మొదలుపెట్టి, 8 మాసాలలో పూర్తి చేయాలనీ ఆదేశించారు.రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికై శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజార్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు 106 షాప్ లతో ఏర్పాటు చేస్తున్న ఈ బాజార్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగు తున్నాయని, డిసెంబర్ మొదటి వారంలోగా ఈ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ ఇందిరా మహిళా శక్తి బజార్లో నిత్యం వివిధ సాంస్కృతిక సామాజిక కార్యక్రమాలు చేయటానకి మహిళలకు ఆర్థిక చేయూతకై నగరంలోని ఐ.టి సంస్థలు, ఇతర ప్రముఖ వాణిజ్య, వ్యాపార సంస్థలకు భాగస్వామ్యం కల్పించాల న్నారు. రాష్ట్రంలో అద్భుతంగా పొదుపు సంఘాలను నిర్వహిస్తూ, అధిక మొత్తంలో డబ్బును పొదుపు చేసిన మహిళా సంఘాలచే బస్సులను కొను గోలు చేయించి వాటిని టీ.ఎస్.ఆర్ .టీ.సి ద్వారా నిర్వహించేందుకు తగు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ సంఘాల ద్వారా మొత్తం 600 బస్సులను కొనుగోలు చేయించాలని, దీనిలో భాగంగా మొదటి దశలో 150 బస్సుల కొనుగోలును వెంటనే చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. ఈ బస్సుల నిర్వహణ భాద్యతలను ఆర్టీసీ చేపడుతుందని అన్నారు. వీటితో పాటు, మహిళా సంఘాల ద్వారా 4000 మేఘావాట్ల సామర్థ్యం గల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, మొదటి దశలో 1000 మెగా వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయిస్తు న్నామని వివరించారు. ఈ ప్లాంట్లను నీటిపారుదల శాఖ, దేవాదాయ, ఆటవీ శాఖలో నిరుప యోగంగా ఉన్న కాళీ భూములను లీజ్ పద్ధతిన సేకరించి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలను కూడా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు అనంతరం వీటి నిర్వహణా భాద్యత లను తెలంగాణ రెడ్కో విద్యుత్ డిస్కం లు చేపడుతాయని స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుల ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాల మహిళలకు పెద్ద మొత్తం లో ఆదాయం లభిస్తుందని సి.ఎస్ తెలిపారు.

రష్యా తొలిసారి ఖండాంతర క్షిపణిని ప్రయోగించింది: కీవ్

న్యూ డిల్లీ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఉక్రెయిన్‌పై ఉదయం చేసిన దాడిలో రష్యా తన దక్షిణ ఆస్ట్రాఖాన్ ప్రాంతం నుండి ఖండాంతర క్షిపణిని ప్రయోగించిందని కీవ్ వైమానిక దళం తెలిపింది. యుద్ధం మొదలైన తర్వాత రష్యా ఇంత సుదూర, శక్తివంతమైన క్షిపణిని ఉపయోగించడం ఇదే తొలిసారి అని ఉక్రెయిన్ పేర్కొంది. జో బైడెన్ అడ్మినిస్ట్రేషన్ ఉక్రెయిన్‌కు యాంటీ పర్సనల్ ల్యాండ్ మైన్‌ల ఏర్పాటును ఆమోదించిన తర్వాత, వ్లాదిమిర్ జెలెన్స్కీ ఒక వీడియోలో యుఎస్‌కి కృతజ్ఞతలు తెలిపారు, ల్యాండ్‌మైన్‌లు "రష్యన్ దాడులను ఆపడానికి అత్యవసరం" అని 'ది గార్డియన్' నివేదించింది. అంతకుముందు, యుఎస్ డిఫెన్స్ సెక్రటరీ లాయిడ్ ఆస్టిన్ మాట్లాడుతూ, మారుతున్న రష్యా వ్యూహాలను ఎదుర్కోవడానికి ఉక్రెయిన్ కోసం యాంటీ పర్సనల్ ల్యాండ్‌మైన్‌లపై వాషింగ్టన్ విధానంలో మార్పు అవసరమని అన్నారు.

యువతిని వెంటపడి వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు

హైదరాబాద్, నవంబర్ 21: గతంలో ఉన్న పరిచయాన్ని అడ్డుగా పెట్టుకుని యువతిని వెంటపడి వేధిస్తుండడంతో పాటు ఆఫీసుకు వచ్చి అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్‌లోని ఓ చానెల్‌లో యాంకర్‌గా పనిచేస్తున్న యువతి(30)కి, హరీశ్ అనే వ్యక్తితో ఐదేళ్లుగా పరిచయం ఉంది. వారిద్దరూ గతంలో ప్రేమించుకున్నారు. అయితే ఏడాది క్రితం హరీశ్ వేరే అమ్మాయిని పెళ్లి చేసుకోవడంతో బాధిత యువతి అతడిని దూరం పెట్టింది. కాగా, గత కొన్ని రోజులుగా హరీశ్ బాధిత యువతికి ఫోన్లు చేస్తుండడంతో పాటు వెంటపడి వేధిస్తున్నాడు.

తనతో మాట్లాడవద్దని యువతి చెప్పినా వినిపించుకోకుండా మూడురోజుల క్రితం నేరుగా ఆమె పనిచేస్తున్న ఆఫీసువద్దకు వచ్చాడు. మద్యం మత్తులో తీవ్ర పదజాలంతో ఆమెను అసభ్యకరంగా దూషించాడు. నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ఫోన్‌లు చేస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడిపై బీఎన్ఎస్ 78(2), 74,79 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా ప్రారంభమైన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

-జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ వెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని అంబేద్కర్ గ్రౌండ్ వద్ద ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ స్టాల్స్ ను ప్రారంభించారు. గౌరవ అతిథులుగా ఆల్ ఇండియా ఫిషర్మెన్ కాంగ్రెస్ జాతీయ చైర్మన్ అర్మస్టాంగ్ ఫెర్నాండో హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ పీసీసీ హన్మంతరావు,టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్(న్ఫ్రా)స్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎఫ్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం నాగరికరీ, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మరియు వలువురు కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. తెలంగాణలోని వలువురు మత్స్యకారులకు ప్రముఖుల చేతుల మీదుగా ఉత్తమ సేవా పత్రాలను అందజేశారు.రాష్ట్ర మత్స్యశాఖ ఉన్నత అధికారులకు సేవలు అందించినందుకుగాను పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంస పత్రాలను అందజేశారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖాముఖి కార్యక్రమానికి వినతుల వెల్లువ

-సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు

హైదేవ్రాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్)శ్రీ; గాంధీభవన్లో గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి వినతులు వెలువత్తాయి. సుమారు 300 మంది వివిధ సమస్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. మొదట బృందాలుగా వచ్చిన వారితో డిప్యూటీ సీఎం సమావేశం అయ్యారు. పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించిన ఇంకా పోస్టింగులు ఇవ్వలేదంటూ జూనియర్ లెక్చరర్స్ అభ్యర్థులు డిప్యూటీ సీఎం కలిశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని డిప్యూటీ సీఎం వారికి హామీ ఇచ్చారు. ట్రాన్స్కో, జెన్కోలో ఖాళీగా ఉన్న డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్ల, ఇంజనీర్ల ఖాళీలను భర్తీ చేయాలని సంబంధిత శాఖ ఉద్యోగులు కోరారు. ఇలా పలు సమస్యలపై ఐదు బృందాలు డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేయగా సమ్మతి అధికారులను వివరణ కోరుతూ లికిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. తదుపరి సాధారణ పౌరులు, కార్యకర్తల సమస్యలు విని సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు, వికలాంగుల పెన్షన్లు, నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతలు తమ విజ్ఞప్తులు సమర్పించారు. తన తల్లి మాదుగు కళ్యాణి (42) బ్రెస్ట్ క్యాన్సర్ తో బాధపడుతుందని, క్యాన్సర్ ఫోర్త్ స్టేజిలో ఉంది హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఆర్థికంగా ఆదుకోవాలని ఆమె కుమారుడు మహేష్ విజ్ఞప్తి చేశారు. వెను వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం ఆసుపత్రి బిల్లులు తీసుకువచ్చి.. ఆ మొత్తానికి ఎల్ఓసి తన వద్ద తీసుకోవాల్సిందిగా తెలిపారు. ఎల్ఓసి మంజూరు బాధ్యతలను ప్రత్యేకంగా పర్యవేక్షించాల్సిందిగా తన పీఏలకు ఆదేశించి క్యాన్సర్ రోగి కుమారుడు మహేష్ కు తన సెల్ నెంబరు ఇచ్చి ఇబ్బంది ఉంటే ఫోన్ చేయాల్సిందిగా తెలిపారు. జూ పార్కులో డైట్ బిల్స్ పెండింగ్లో ఉన్నాయని సిబ్బంది కోరగా ... వెంటనే మంజూరు చేయాలంటూ అధిక శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తన లాండ్రీ షాపుకు 20వేల కరెంటు బిల్లు వచ్చినట్టు ఓ వినియోగదారుడు సమస్యను దృష్టికి తీసుకురాగా పరిష్కరించాల్సిందిగా నమాధి అధికారులను సెల్ఫోన్లో ఆదేశించారు. వినతుల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కార్యాలయానికి సంబంధించి 28 దరఖాస్తులు రాగా, సీఎం ఓ కార్యాలయం కి సంబంధించి 199, రెవిన్యూ శాఖకు సంబంధించి 41, సివిల్ సప్లై శాఖ 9, రవాణా శాఖ, బీసీ వెల్ఫేర్ కి సంబంధించి 4, పర్యాటక శాఖకు సంబంధించి 2, దేవాలయ, అటవీశాఖ కు సంబంధించిన 8, పిసిసి కార్యాలయం సంబంధించి 19, జిహెచ్ఎంసి 6, వ్యవసాయ శాఖ కు సంబంధించిన 8 దరఖాస్తులు వచ్చాయి.

ప్రయాణికుల వాహనాలపై కాల్పులు.. 38 మంది మృతి

ఇస్లామాబాద్, నవంబర్ 21: ప్రయాణికుల వాహనాలపై ముష్కరులు దాడి చేశారు. సాయుధులైన వ్యక్తులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో 38 మంది మరణించారు. మరో 29 మంది గాయపడ్డారు. మహిళలతోపాటు పిల్లలు కూడా మృతులు, గాయపడిన వారిలో ఉన్నారు. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఈ సంఘటన జరిగింది. గురువారం గిరిజన కుర్రం జిల్లాలోని పరాచినార్‌లో సాయుధులైన వ్యక్తులు దారుణానికి పాల్పడ్డారు. పెషావర్ నుంచి పరాచినార్‌కు, పరాచినార్ నుంచి పెషావర్‌కు ప్రయాణీకులతో వెళ్తున్న రెండు వ్యాన్లపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. ఆ రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న వారిలో 38 మంది మరణించారు. మరో 29 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో మహిళలు, పిల్లలు ఉన్నారు.

కాగా, ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్ చీఫ్ సెక్రటరీ నదీమ్ అస్లాం చౌదరి ఈ దాడిని ధృవీకరించారు. ఇది పెద్ద విషాదమని, మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ కూడా ఈ దాడిని ఖండించారు. 'అమాయక ప్రయాణికులపై దాడి చేయడం పిరికి, అమానవీయ చర్య' అని పేర్కొన్నారు.

మరోవైపు ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉన్న ఈ గిరిజన ప్రాంతంలో భూ వివాదంపై సాయుధ షియా, సున్నీ ముస్లింల మధ్య దశాబ్దాలుగా దాడులు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అయితే ఈ దాడికి ఏ గ్రూపు బాధ్యత వహించలేదని అధికారులు తెలిపారు.

రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు.. వలస నేతలకు పదవులు ఇవ్వడంపై ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 21:దశాబ్దాలుగా జెండా మోసిన వారిని కాదని వలస వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడంపై కాంగ్రెస్ నేతలు రోడ్డెక్కారు. పార్టీ నాయకత్వ తీరును నిరసిస్తూ కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో గురువారం ధర్నాకు దిగారు. బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధిలో సీనియర్ కార్యకర్తలు ఉన్నా.. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన దుర్గం శ్యామలకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని కట్టబెట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్న వారిని కాదని ఇటీవల కాంగ్రెస్‌లోకి వచ్చిన పోచారం శ్రీనివాసరెడ్డి అనుచరులకు పదవులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తమ ఆవేదనను పార్టీ పెద్దలు గుర్తించకపోతే హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను తొలగించి.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ప్రతిపాదించిన ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల జేఎన్టీయూలో విద్యార్థి అదృశ్యం..!

జగిత్యాల, నవంబర్ 21: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ రెండో సంవత్సరం చదువుతున్న అర్నిపల్లి హితేశ్ అదృశ్యమయ్యాడు. మల్యాల సర్కిల్ సీఐ నీలం రవి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పార్వతీపురం జిల్లా గరువుబిల్ల మండలం రావివలస గ్రామానికి చెందిన హితేశ్ 2023లో మెకానికల్ మొదటి సంవత్సరంలో చేరాడు. ఈ నెల 19న కళాశాల ఓల్డ్ హాస్టల్ బంగ్లా పక్కనున్న గోడవైపు నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు.

రాత్రి హాస్టల్‌కు తిరిగి రాకపోవడంతో కేర్ టేకర్ యుగేంధర్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు తన కొడుకు ఉంటున్న రూమ్ నంబర్ 320లోని తోటి స్నేహితులను విచారించాడు. మల్యాల సీఐ నీలం రవి హితేశ్ తోటి విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా హితేశ్ మూడీగా ఉంటున్నాడని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు, పోలీసులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

నైపుణ్య విద్యకు కంప్యూటర్ పరిజ్ఞానం తోడవ్వాలి !

ఏ దేశానికి లేని ఓ అద్భుత వనరు భారతమాత చెంత ఉన్నది. యువశక్తి అత్యధికంగా ఉన్న దేశంగా భారత్ ముందు వరుసలో ఉంటూ "యువభారత్"గా పిలువబడుతున్నది. ఆఫ్రికాలో ప్రజల సగటు వయస్సు 19 ఉండాగా చైనాలో 40, యూఎస్‌లో 44, ఇటలీలో 48, జర్మనీలో 46, జపాన్‌లో దాదాపు 50గా నమోదు అవుతున్నది. భారత్‌లో జనాభా సగటు వయస్సు 29గా లెక్కించబడింది. యువ జనాభా అత్యధికంగా ఉండడం వరంగా మారాలంటే డిజిటల్ యుగానికి సమానంగా, అంతర్జాతీయ స్థాయి విద్యా బోధనలు నిరంతరం కొనసాగాలి. విద్యా విధానంలో నాటి పాత పోకడలే కొనసాగితే భారత యువశక్తి శాపంగా మారి దేశం అశాంతికి కేంద్రంగా మారుతుందని గమనించాలి.

ఆధునిక డిజిటల్ విద్య అందని ద్రాక్షేనా !

ఎనిమిది బిలియన్లకు పైగా ఉన్న ప్రపంచ జనాభాలో భారత జనాభా 1.4 బిలియన్లు దాటింది. నేటి విద్యావిధానం ప్రపంచ స్థాయి నవ్య శాస్త్రసాంకేతిక శాస్త్రాల స్థాయికి చేరడానికి భారతదేశ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని గుర్తుంచుకోవాలి.

పాఠ్యాంశాల్లో మార్పులు, ఆధునిక ప్రయోగశాలల ఏర్పాటు, టీచర్ల నియామకాలు, అప్‌డేట్ కావడానికి ఉపాధ్యాయులకు కాలానుగుణంగా శిక్షణ, ఉపాధ్యాయుల వేతనాలు, పాఠశాలల విస్తరణ, ఆధునిక సదుపాయాలు తక్షణమే అవసరం అవుతాయని తెలుసుకోవాలి.

అప్‌డేట్ కాని యువత అవుట్‌డేట్ అవుతుందని మన అనుభవం స్పష్టం చేస్తున్నది. భారత దేశవ్యాప్తంగా 1.4 మిలియన్ల పాఠశాలలు ఉండగా సదుపాయాలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. భారత్‌లో 10 – 20 ఏండ్ల వయస్సు కలిగిన బాలలు/యువత 200 మిలియన్లు ఉన్నారు. ఆధార్, యూపిఐ చెల్లింపులు, డిజిటల్‌లాకర్ సౌకర్యాల్లో ముందున్న డిజిటల్ భారతం పాఠశాల నైపుణ్య విద్యా ప్రమాణాల్లో వెనుకబడి ఉందని నిపుణులు వాపోతున్నారు. డిజిటల్, ఏఐ విప్లవానికి తగిన విద్యా బోధన భారతానికి అందని ద్రాక్షే అవుతున్నది.

ఆధునికతకు తగిన సెలబస్ రూపకల్పన:

నాణ్యమైన విద్య, ఆ విద్యకు తగిన శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలు బోధించని యెడల మన యువ జనాభా దేశానికి పెనుశాపంగా మారి నిరుద్యోగం మరింత విజృంభిస్తుంది. మన ప్రస్తుత విద్యా విధానాన్ని తక్షణమే పునర్ సమీక్షించాల్సిన అగత్యం ఏర్పడింది. నాణ్యమైన ఉపాధ్యాయులు, పాఠశాల వసతులు, నిరంతర సెలబస్ రూపకల్పనలు, కొత్త పోకడలకు శాస్త్ర సాంకేతిక విజ్ఞానం దారులు, ప్రభుత్వాల పట్టుదల లాంటివి కొనసాగాలి. అగ్ర రాజ్యాల యువత రేపటి కలలను సాకారం చేసుకోవడానికి నేడే నాంది పలుకుతుండగా, భారతం మాత్రం "ఓల్డ్ ఈజ్ గోల్డ్ " అనే నానుడికి లోబడి పాత సిలబస్‌లు, అరకొర అర్హతలకు అతుక్కుపోతూ ఉపాధ్యాయులు, పాఠశాలల నత్తనడకన బోధనలు కొనసాగుతున్నాయి. రేపటి యవత అవకాశాలకు నేడే నైపుణ్య పెట్టుబడి పెట్టాలని మరిచి పోతున్నాం, మారడానికి మీనమేషాలు లెక్కిస్తున్నాం.

పాఠశాల స్థాయిలోనే కంప్యూటర్ పరిజ్ఞాన బీజాలు నాటాలి:

ప్రతి భారతీయ విద్యార్థి చేతికి ఆధార్ కార్డు వలె ఒక కంప్యూటర్ అందజేయాలని, ఒక్క విద్యార్థి వేలి ముద్రలతోనే పని చేసే విధంగా రూపొందించాలని, అమ్మడానికి/ మార్చుకోవడానికి వీలు లేకుండా తయారు చేయాలని, అనవసర అంశాలు చూడడానికి తావు లేకుండా ప్రత్యేక కంప్యూటర్లను పంపిణీ చేయాలని సూచిస్తున్నారు. అన్ని పాఠశాలలను వైఫై కనెక్షన్, అపరిమిత డాటా వినియోగం అందుబాటులో ఉండే ఆధునీకరించాలి. కంప్యూటర్ విద్య నేర్పడానికి అర్హులైన శిక్షకులను నియమించి, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు ఆకర్షనీయ బహుమతులు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. పాఠ్యాంశాలను దాటి నేర్చుకోవడానికి ఇష్టపడే యువత నుంచి అదనంగా ఫీజులు వసూలు చేస్తూ నేటి విద్యా విధానానికి అదనంగా ఈ కంప్యూటర్ లిటరసీ విద్యా బోధన కొనసాగాలి.

డిజిటల్ యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం కొరవడితే ఎంతటి డిగ్రీల చదువులైన పనికిరాని పట్టాలే అవుతాయి. మారుతున్న కాలానికి యువశక్తిని కూడా తదనుగుణంగా మార్చాలి. ప్రపంచ స్థాయి శాస్త్రసాంకేతిక విజ్ఞానాలను యువభారతానికి బహుకరించాలి. రేపటి ప్రపంచానికి యువభారతం దారి దీపం కావడానికి నేడే నిర్దిష్ట పెట్టుబడులు దీర్ఘకాలిక పెట్టి యువభారతాన్ని నైపుణ్యనిధిగా మార్చాలి.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

గోవా సంస్కృతి, సినిమా అనుభూతులను పంచే వేడుక

- ఇఫీ 2024 వివరాలు వెల్లడించిన ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

న్యూఢిల్లీ, నవంబర్ 21:55వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు (ఇఫీ) ఈ నెల 20 నుంచి 28 వరకు ప్రకృతి అందాల నడుమ గోవాలో జరుగుతాయి. ఈ ఏడాది నిర్వహిస్తున్నఈ వేడుక సినిమాల ఆడంబరం, విభిన్నమైన కథనాలు, వినూత్న స్వరాలకు ప్రతీకగా నిలుస్తుంది. అలాగే పరస్పర సాంస్కృతిక వినిమయాన్ని ప్రోత్సహిస్తుంది.

ఇఫీ ఉత్సవాలు ప్రారంభమవడానికి ముందుగా ఈ రోజు గోవాలో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ మాట్లాడారు. ఇఫీ 55వ ఉత్సవాలకు ఆతిథ్యం ఇవ్వడానికి, అంగరంగ వైభవంగా జరిగే ఈ సినీ వేడుకలకు హాజరయ్యే ప్రతినిధులను స్వాగతించడానికి గోవా సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ వేడుకల్లో 81 దేశాలకు చెందిన 180 అంతర్జాతీయ చిత్రాలను ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవాలు జరిగే వేదికల వద్దకు చేరుకోవడానికి వీలుగా ఉచిత రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రతిభ, సంస్కృతిని చాటిచెప్పే 14 గోవా చిత్రాలను ప్రత్యేకంగా ప్రదర్శిస్తారని శ్రీ సావంత్ తెలిపారు. ఇఫీ పరేడ్ మార్గంలో 'స్కై లాంతర్' పోటీలు నిర్వహిస్తారు. దీనిలో పాల్గొనేవారికి నగదు బహుమతులు అందిస్తారు. ఈ నెల 22న ఈఎస్‌జీ కార్యాలయం నుంచి కళా అకాడమీ వరకు ఇఫీ పరేడ్ నిర్వహిస్తున్నట్లు శ్రీ సావంత్ తెలిపారు.

గోవాలోని ఎంటర్టైన్‌మెంట్ సొసైటీ వైస్ ఛైర్మన్ శ్రీమతి డెలియాలా లోబో మీడియాతో మాట్లాడుతూ, ఈ వేడుకలను పర్యావరణ హితంగా, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

ఈ ఏడాది 6,500 మంది ప్రతినిధులు నమోదు చేసుకున్నారని, గతేడాదితో పోలిస్తే ఇది 25 శాతం పెరిగిందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పృథుల్ కుమార్ తెలిపారు. సినిమా ప్రేమికులకు ఈ పండగను మరింత చేరువ చేసేందుకు ఈ ఏడాది 6 స్క్రీన్లు అదనంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే స్క్రీనింగ్ థియేటర్లను 45 శాతం పెంచారు. ఈ ఉత్సవంలో సినీ ప్రముఖులు పాల్గొంటారని శ్రీ కుమార్ తెలిపారు. సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ నాయకత్వంలో ఈ ఉత్సవాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని, వారికి అందించే నాణ్యమైన అనుభవాలను కొత్త శిఖరాలకు చేర్చేలా ఎన్ఎఫ్‌డీసీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని శ్రీ కుమార్ పేర్కొన్నారు. సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఉత్సవాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి సమర్థ మార్గదర్శకత్వంలో ఏర్పాట్లను సమన్వయం చేసుకుంటూ, వసులు సకాలంలో పూర్తి చేసి సినీ ప్రేమికులు అందరినీ ఒకచోట చేర్చడానికి పండుగ ప్రయత్నిస్తుంది.

పాత్రికేయులకు సినీ రంగానికి సంబంధించిన అన్ని విభాగాలతో పాటు సినిమా వ్యాపారాంశాలపై లోతైన అవగాహన పెంపొందించేలా ప్రెస్ టూర్ నిర్వహించనున్నట్టు శ్రీ కుమార్ తెలియజేశారు.

సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి వృందా దేశాయ్, పీఐబీ డైరెక్టర్ జనరల్ స్మితా వత్స్ శర్మ, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, పీఐబీ, ఈఎస్‌జీకి చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ఇఫీ 2024 లో నిర్వహించే ప్రధాన కార్యక్రమాలను మీడియాకు వివరించారు. అవి:

యువ చిత్ర దర్శకులపై దృష్టి సారించిన ఇఫీకి ఈ ఏడాది సీఎం వోటీ విభాగం ద్వారా రికార్డు స్థాయిలో 1032 ఎంట్రీలు వచ్చాయి. గతేడాది వచ్చిన దరఖాస్తుల సంఖ్య 550.

సమాచార, ప్రసార శాఖ మంత్రి మార్గదర్శకత్వంలో ఇఫీ 2024 యువ దర్శకులపై దృష్టి సారిస్తుంది. "క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో" కార్యక్రమం 100 మంది యువ ప్రతిభావంతులకు (మునుపటి ఎడిషన్‌లో 75 మంది మాత్రమే పాల్గొన్నారు) తోడ్పాటు అందించేలా విస్తరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన యువ సినీ విద్యార్థులను ఆహ్వానించారు.

దేశంలో వెలుగులోకి వస్తున్న యువ చిత్ర దర్శకుల ప్రతిభను గుర్తించేందుకు మొదటి సారిగా నూతన పురస్కార విభాగాన్ని పరిచయం చేశారు. అదే ఉత్తమ భారతీయ డెబ్యూ డైరెక్టర్. యువ దర్శకులకు ప్రత్యేక శిక్షణా తరగతులు, చర్చా వేదికలు, సినిమా స్క్రీనింగులను ఏర్పాటు చేశారు. ఎంటర్‌టైన్మెంట్ జోన్ ఇఫీయెస్టాలో సంగీతం, నృత్యం ఇతర సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా యువత భాగస్వామ్యాన్ని పెంచుతారు.

ఇఫీ 2024కు రికార్డు స్థాయిలో స్పందన వచ్చింది. ఇప్పటి వరకు 101 దేశాల నుంచి 1,676 దరఖాస్తులు వచ్చాయి. అంతర్జాతీయంగా ఇఫీకు పెరుగుతున్న ఆదరణకు ఇది నిదర్శనం. ఈ వేడుకల్లో 16 గ్లోబల్ ప్రీమియర్లు, 3 అంతర్జాతీయ ప్రీమియర్లు, 43 ఆసియా ప్రీమియర్లు, 109 ఇండియన్ ప్రీమియర్లతో సహా 81 దేశాలకు చెందిన 180 చలనచిత్రాలను ప్రదర్శిస్తారు. అంతర్జాతీయంగా గుర్తింపు సాధించిన సినిమాలు, అవార్డులు గెలుచుకున్న చిత్రాల ప్రదర్శనతో ఈ ఏడాది ఉత్సవాలు ప్రేక్షకులకు మరపురాని అనుభూతిని అందిస్తాయి.

ఈ చిత్రోత్సవాల్లో ఆస్ట్రేలియా ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. స్క్రీన్ ఆస్ట్రేలియా, ఎన్ఎఫ్‌డీసీ మధ్య జరిగిన ఒప్పందం ద్వారా ప్రత్యేకంగా చిత్రాలను ప్రదర్శిస్తారు. ఇది రెండు దేశాల మధ్య మైత్రిని పెంపొందిస్తుంది. మైఖేల్ గ్రేసీ రూపొందించిన ఆస్ట్రేలియన్ చిత్రం బెటర్ మ్యాన్‌తో ఈ ఉత్సవం ప్రారంభం కానుంది. ఈ చిత్రం, దిగ్గజ బ్రిటీష్ పాప్‌స్టార్ రాబీ విలియమ్స్ జీవిత విశేషాలతో తెరకెక్కింది.

సత్యజిత్ రే జీవన సాఫల్య పురస్కారాన్ని ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ దర్శకుడు 'ఫిలిప్ నోయ్స్'కి అందజేస్తారు. ఆయన అసాధారణమైన కథనం, ఉత్కంఠభరితమైన, సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలను రూపొందించడంలో పేరుగాంచారు. నోయిస్ తెరకెక్కించిన చిత్రాల్లో పేట్రియాట్ గేమ్స్, క్లియర్ అండ్ ప్రెజెంట్ డేంజర్, సాల్ట్, ది సెయింట్, ది బోన్ కలెక్టర్ తదితర ప్రేక్షకాదరణ పొందిన చిత్రాలున్నాయి. హారిసన్ ఫోర్డ్, నికోల్ కిడ్‌మాన్, ఏంజెలీనా జోలీ, డెన్జెల్ వాషింగ్టన్, మైఖేల్ కెయిన్ లాంటి ప్రముఖ నటులతో చిత్రాలను తెరకెక్కించి వెండితెరపై చెరగని ముద్ర వేశారు.

అంతర్జాతీయ విభాగంలో 15 చలనచిత్రాలు (12 అంతర్జాతీయ, 3 భారతీయ చిత్రాలు) పోటీపడతాయి. గెలుపొందిన చిత్రానికి ప్రతిష్ఠాత్మకమైన ఉత్తమ చలనచిత్ర పురస్కారం గోల్డెన్ పీకాక్‌తో పాటు 40 లక్షల నగదు బహుమతి లభిస్తుంది. ఉత్తమ చిత్రంతో పాటు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, స్పెషల్ జ్యూరీ విభాగంలో విజేతలను జ్యూరీ నిర్ణయిస్తుంది.

ఉత్తమ ఫీచర్ చిత్రం డెబ్యూ డైరెక్టర్ అవార్డ్ కేటగిరీలో, 5 అంతర్జాతీయ, 2 భారతీయ సినిమాలు పోటీ పడతాయి. విజేతకు సిల్వర్ పీకాక్, రూ 10 లక్షల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారు.

అంతర్జాతీయ జ్యూరీకి ప్రఖ్యాత భారతీయ చిత్ర దర్శకుడు శ్రీ అశుతోష్ గోవారికర్ (ఫ్రైర్‌పర్సన్) నేతృత్వం వహిస్తారు. ప్రసిద్ధ సింగపూర్ రచయిత, దర్శకుడు, నిర్మాత ఎలిజబెత్ కార్ప్సన్, బ్రిటన్ నిర్మాత ఫ్రాన్ బోర్జియా, ఆసియాలో ప్రముఖ నిర్మాత ఆంథోనీ చెన్ ఈ జ్యూరీలో ఉంటారు.

భారతీయ పనోరమా విభాగంలో దేశ సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని తెలియజేసే 25 ఫీచర్ చిత్రాలు, 20 నాన్–ఫీచర్ సినిమాలను ప్రదర్శిస్తారు. ఫీచర్ విభాగంలో రణదీప్ హుడా దర్శకత్వం వహించిన స్వాతంత్ర్య వీర్ సావర్కర్ (హిందీ), నాన్ ఫీచర్ విభాగంలో ఘర్ జైసా కుచ్ (లద్దాఖీ)తో ఈ ప్రదర్శనలు ప్రారంభమవుతాయి.

ఈ ఏడాది ఇఫీ ఇతివృత్తం 'యువ దర్శకులు' ఆధారంగా వెలుగులోకి వస్తున్న దర్శకుల ప్రతిభను గుర్తించడానికి నూతన పురస్కార విభాగం 'ఉత్తమ భారతీయ డెబ్యూ డైరెక్టర్'ను ప్రారంభించారు. ఈ విభాగంలో మొత్తం 102 చిత్రాల నుంచి ఎంపిక చేసిన 5 చిత్రాలు పోటీపడతాయి. విజేతకు వేడుకల ముగింపు కార్యక్రమంలో ప్రశంసా పత్రం, రూ. 5 లక్షల నగదు బహుమతి అందజేస్తారు.

ఉత్తమ వెబ్ సిరీస్ (ఓటీటీ) అవార్డుకు గతేడాది 32 ఎంట్రీలు వస్తే.. ఈ ఏడాది ఆ సంఖ్య 42కు పెరిగింది. పురస్కారం గెలుచుకున్న సిరీస్‌కు ప్రశంసాపత్రం, రూ.10 లక్షల నగదు బహుమతిని అందజేస్తారు. విజేతను ముగింపు వేడుకల్లో ప్రకటిస్తారు.

శతాబ్ది ఉత్సవాలు: ఇఫీ 2024 ఉత్సవాల్లో రాజ్ కపూర్, మహ్మద్ రఫీ, తపన్ సిన్హా, అక్కినేని నాగేశ్వరరావు లాంటి భారతీయ సినీ దిగ్గజాలకు నివాళిగా ప్రత్యేక ఆడియో–విజువల్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిని ప్రారంభ, ముగింపు వేడుకల్లో ప్రదర్శిస్తారు. అలాగే ఇఫీ యెస్టాలో ఇమర్సివ్ ఎగ్జిబిషన్లు, ఇండియా పోస్ట్ ద్వారా స్మారక స్టాంపుల సిరీస్ ను విడుదల చేస్తారు. ఈ దిగ్గజాలు ఒక్కొక్కరికీ చెందిన ఒక్కో క్లాసిక్ చిత్రాన్ని భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఫిలిం హెరిటేజ్ మిషన్ (ఎన్‌హెచ్ఎఫ్ఎం) ద్వారా ఎన్ఎఫ్‌డీసీ, ఎన్ఎఫ్ఏఐ పునరుద్ధరించాయి. రాజ్ కపూర్ ఆవారా, అక్కినేని నాగేశ్వర రావు దేవదాసు(1953), మహ్మద్ రఫీ హమ్ దోనో, తపన్ సిన్హా హర్మోనియంలను ఇఫీలో ప్రదర్శిస్తారు.

రైజింగ్ స్టార్స్ (నూతన దర్శకుల ప్రతిభను ప్రోత్సహించడం), మిషన్ లైఫ్ (పర్యావరణ స్పృహను పెంచే సినిమాలకు ప్రాధాన్యం), ఆస్ట్రేలియా: ప్రధాన ఆకర్షణగా నిలవనున్న దేశం, ఒప్పంద దేశ ప్యాకేజీ పేరుతో నాలుగు కొత్త అంతర్జాతీయ ప్రోగ్రామింగ్ విభాగాలతో పాటు బ్రిటిష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎంపిక చేసిన చిత్రాలు ప్రదర్శిస్తారు.

వైవిధ్యం, సమ్మిళిత భావాన్ని ప్రోత్సహించేందుకు మహిళలు దర్శకత్వం వహించిన 47 చలనచిత్రాలతో పాటు యువమహిళా దర్శకులు తెరకెక్కించిన 66 డెబ్యూ సినిమాలను సైతం ప్రదర్శిస్తారు. ఇది ఈ రంగంలో ప్రాతినిధ్యం తక్కువగా ఉన్న వారి వాణిని విస్తరించే దిశగా ఉత్సవాలకున్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. 'సినిమాల్లో మహిళలు' విభాగం వెలుగులోకి వస్తున్న మహిళా దర్శకుల ప్రతిభను చాటిచెబుతుంది.

ఈ ఏడాది అదనంగా ఆరు థియేటర్లలో స్క్రీనింగులు ఏర్పాటు చేస్తారు. అందులో ఐనాక్స్ మడ్‌గోవాకు చెందిన నాలుగు థియేటర్లు, ఐనాక్స్ పొండాకు చెందిన 2 థియేటర్లు ఉన్నాయి. చలన చిత్రోత్సవాల్లో 270 చిత్రాలను ఐదు వేదికల్లో ప్రదర్శిస్తారు. ఐనాక్స్ పాంజిమ్ (4), మాక్సినెజ్ ప్యాలెస్ (1), ఐనాక్స్ పోర్వోరిమ్ (4), ఐనాక్స్ మడ్‌గోవా (4), ఐనాక్స్ పొండా(2), జెడ్ స్క్వేర్ సాఫ్రూట్ అశోక్ (2) ఇవి కాకుండా అదనంగా మరో 5 ఇన్స్టాలేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు.

సీఎంవోటీ కార్యక్రమానికి ఈ ఏడాది రికార్డు స్థాయిలో 1,032 దరఖాస్తులు వచ్చాయి. ఈ సంఖ్య 2023తో పోలిస్తే దాదాపు రెట్టింపు. ఈ కార్యక్రమం 13 సినిమా విభాగాల్లో యువ ప్రతిభను ప్రోత్సహిస్తుంది. అలాగే మొదటి సారిగా 100 మంది ఔత్సాహిక చిత్ర దర్శకులను ఎంపిక చేసి వారి ప్రతిభను మెరుగులద్దుకునేందుకు వేదిక కల్పిస్తారు.

ప్రత్యేక శిక్షణా తరగతులు, చర్చా కార్యక్రమాలు, పరిశ్రమతో మమేకం: ఔత్సాహిక చిత్ర దర్శకులకు కళా అకాడమీలో ఏఆర్ రెహమాన్, ప్రసూన్ జోషి, షబానా అజ్మీ, మణిరత్నం, విధు వినోద్ చోప్రా, ఇతర అంతర్జాతీయ సినీ నిపుణుల నేతృత్వంలోని 25 కంటే ఎక్కువ శిక్షణ కార్యక్రమాలు, చర్చా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఫిలిప్ నోయ్స్, జాన్ సీల్ లాంటి దిగ్గజాలు సౌండ్ డిజైన్, డిజిటల్ యుగంలో నటన, చిత్ర నిర్మాణ భవిష్యత్తు గురించి కూలంకషంగా చర్చిస్తారు.

ఫిల్మ్ బజార్ 2024: దక్షిణాసియాలో అతిపెద్ద సినిమా మార్కెట్: 18వ ఫిలిం బజార్ ను గతంలో కంటే ఎక్కువగా విస్తరించారు. సినిమా రంగంలో వివిధ జోనర్లకు చెందిన 350 కంటే ఎక్కువ చిత్రాలను ప్రదర్శిస్తారు. ఫిలిం బజార్ సలహాదారుగా 'మార్చ్ డె కేన్స్' మాజీ మార్కెట్ హెడ్ శ్రీ జెరోమ్ పిల్లర్డ్ ఫిల్మ్ బాధ్యతలు స్వీకరించారు. చలనచిత్ర నిర్మాణం, పంపిణీ, అంతర్జాతీయ భాగస్వామ్యంపై అవగాహన పెంచేలా వర్క్ షాపులు నిర్వహిస్తారు. 2007లో ప్రారంభమైన నాటి నుంచి దక్షిణాసియాలో అతిపెద్ద, అత్యంత ముఖ్యమైన సినిమా మార్కెట్‌గా ఫిలిం బజార్ మారింది. ఈ ఏడాది సముద్ర తీరంలో పెవిలియన్లు, ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేస్తారు. వివిధ దేశాలు, రాష్ట్రాలకు చెందిన చిత్ర పరిశ్రమ, టెక్ అండ్ వీఎఫ్ఎక్స్ పరిశ్రమ నుంచి అధిక సంఖ్యలో పాల్గొంటారు. చిత్ర పరిశ్రమను మరింత మెరుగు పరచడానికి ఫిక్కీ సహకారంతో అనేక కార్యక్రమాలు జరుగుతాయి. అలాగే ఫిల్మ్ బజార్‌లో 'బయ్యర్స్–సెల్లర్స్' మీట్ నిర్వహిస్తారు. దీనికి అందరూ ఆహ్వానితులే. ఇక్కడ చిత్ర దర్శకులు, ఇతర నిపుణులను కలుసుకోవచ్చు.

'ఇఫీ యెస్టా' సాంస్కృతిక ఉత్సవాలతో గొప్ప అనుభూతి: ఇఫీ 2024లో మొదటి సారిగా ఏర్పాటు చేసిన ఇఫీయెస్టా సినిమా, సంగీతం, నృత్యం, ఆహారం, కళ, అనుభవాల మాయాజాలం ద్వారా సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించేలా ఈ వినోద మహోత్సవాన్ని నిర్వహిస్తుంది. దీనిని డిస్ట్రిక్ట్ బై జొమాటో నిర్వహిస్తుంది. ప్రత్యక్ష ప్రదర్శనలు, ఆహారం, సరదా కార్యక్రమాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన వేదికే ఇఫీయెస్టా. కళా అకాడమీ, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు యువతను ఆకర్షించేలా ఉంటాయి. వీటిలో భారతీయ సినిమా ప్రయాణంపై ఎగ్జిబిషన్‌తో పాటు మంత్రముగ్ధులను చేసే 4 శతాబ్ది ఉత్సవాల చిత్రాల ప్రదర్శన ఉంటుంది. నవంబర్ 22న ఇఫీయెస్టాలో 'జర్నీ ఆఫ్ ఇండియన్ సినిమా' కార్నివాల్ పరేడ్ నిర్వహిస్తారు.

ప్రజలను మమేకం చేసేలా వేడుకల నిర్వహణ: ఇఫీ వేడుకల చరిత్రలోనే తొలిసారిగా, 55వ ఇఫీ ఉత్సవాలు ప్రజలందరికీ చేరువలో ఉంటాయి. ఈ ఉత్సవాల్లో అందరూ పాల్గొనేందుకు ప్రత్యకమైన ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా దివ్యాంగులను ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రోత్సహించేందుకు 'స్వయం' అనే సంస్థను భాగస్వామిగా ఇఫీ ప్రకటించింది. ఇఫీ 2024 వేడుకలు జరిగే అన్ని వేదికలు వారికి అనువుగా తయారుచేయడంతో పాటు ప్రత్యేకావసరాలు కలిగిన వారి గురించి వాలంటీర్లకు అవగాహన కల్పిస్తారు. తద్వారా దివ్యాంగులను ఈ వేడుకల్లో భాగస్వాములను చేసేందుకు ఇఫీ కట్టుబడి ఉంది. ఇఫీలో ప్రదర్శించే చలనచిత్రాలు, కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ఆడియో, సంకేత భాషలో వివరించేందుకు మొబైల్ అప్లికేషన్లను వినియోగిస్తున్నారు. ప్రధానమంత్రి సూచించిన 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' స్ఫూర్తిని పెంపొందించేలా అందరినీ మమేకం చేసేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

గిరిజన తండాలకు రూ.4.90 కోట్లు మంజూరు- బైరెడ్డి శబరి

అమరావతి, నవంబర్ 21: గిరిజన తండాల అభివృద్ధి కోసం, వారి తండాల్లో విద్యుత్ వెలుగులు నింపేందుకు, రహదారుల నిర్మాణానికి రూ.4.90 కోట్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించినట్లు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. గురువారం ఆమె తెలిపిన వివరాల మేరకు? జిల్లాలోని గిరిజన తండాలైన కపిలేశ్వరం నుంచి జనాలగూడెం వరకు తారురోడ్డు నిర్మాణం కోసం రూ.4.40 కోట్లు మంజూరయ్యాయి. శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన, సారవంతమైన వ్యవసాయ భూములు, ఇల్లు త్యాగం చేసి సర్వం కోల్పోయి నల్లమల అరణ్యంలో కనీస వసతులకు దూరంగా జీవిస్తున్న అడవి బిడ్డలకు కనీసం రోడ్డు మార్గం ఏర్పాటు చేసి, రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు ప్రసరింపజేసి చీకట్లో మగ్గుతున్న ఆ గ్రామాలకు బయటి ప్రపంచంతో అనుసంధానం చేసేందుకు, విద్యుత్ సరఫరా కోసం నిధులు మంజూరయ్యాయని డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం నల్లమల అరణ్యంలో బయటి ప్రపంచానికి దూరంగా బ్రతుకుతున్న బలపాలతిప్ప, జానాలచెంచుగూడెం, సిద్దేశ్వరం, కపిలేశ్వరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు రూ.50 లక్షలు, తారురోడ్డు నిర్మాణం కోసం రూ.4.40 కోట్లు కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించినట్లు తెలిపారు. కపిలేశ్వరం గ్రామం నుంచి సిద్దేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం వరకు 7.10 కిలోమీటర్లు దూరం వరకు 7.30 మీటర్ల వెడల్పుతో మెటల్ రోడ్డు, వాటిపై 3.75 మీటర్ల వెడల్పుతో బీటీ (తారు) రోడ్డు నిర్మాణం కోసం, రోడ్డు ప్రక్కన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు వేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు ఎంపీ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ప్రధానమంత్రి జనజాతీ ఆదివాసిన్యాయ్ మహా అభియాన్ పథకం ద్వారా, ట్రైబల్ గ్రూప్ ఆధ్వర్యంలో తారు రోడ్డుకు 4.40 కోట్ల రూపాయలు, విద్యుత్ సరఫరాకు 50 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి వివరించారు.

భూగర్భ జలాల అనుమతుల కోసం "భూ- నీర్" పోర్టల్ ను ప్రారంభించిన జల్ శక్తి మంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 21:ఈ ఏటి ఇండియా వాటర్ వీక్ ముగింపు ఉత్సవం సందర్భంగా "భూ–నీర్" పోర్టల్ ను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ మంత్రి శ్రీ సీ ఆర్ పాటిల్ 2024 సెప్టెంబరు 19వ తేదీన ప్రారంభించారు. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ కేంద్ర (ఎన్ఐసీ) సహకారంతో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ పరిధిలోని కేంద్ర భూగర్భ జలాల ప్రాధికార సంస్థ (సీజీడబ్ల్యూఏ) ఈ వెబ్ సైటును రూపొందించింది. దేశవ్యాప్తంగా భూగర్భ జలాల వాడకాన్ని మరింత పకడ్బందీగా నియంత్రించే ఉద్దేశంతో దీనిని ప్రతిపాదించారు. భూగర్భ జలాల యాజమాన్యం, నియంత్రణ అంశాలు ఇక నుంచీ పూర్తిగా ఈ పోర్టల్ పరిధిలోకి వస్తాయి. భూగర్భజలాల వాడకంలో పారదర్శకత, నైపుణ్యం, మనుగడ అన్న అంశాలకు ఇక ముందు ప్రాధాన్యం ఏర్పడుతుంది.

భూగర్భ జలాల వాడకం, నియంత్ర

దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు సదుపాయం..



అమరావతి, నవంబర్ 21:కర్నూలు జిల్లాలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానం కోసం దేశంలోని నలుమూలల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం నేటి నుంచి ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు స్వామి వారి దర్శనార్థం దేశం నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో వారి వాహనాల ద్వారా శ్రీశైలం రావడం జరుగుతుందన్నారు.

మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాలు, సంక్రాంతి, శ్రావణమాసం, వినాయక చవితి, దసరా, కార్తీకమాసం వంటి పర్వదినముల యందు వారాంతపు రోజుల్లో భక్తులు లక్షలాది సంఖ్యలో వస్తున్నారు. భక్తుల వాహనములకు ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా ఔటర్ రింగ్ రోడ్డు పార్కింగ్ ప్రదేశాలకు తరలించుట జరుగుతుందని తెలిపారు.

భక్తుల సౌకర్యార్థమై వారాంతపు రోజుల్లో అనగా ప్రతి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి సోమవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రతి అరగంట సమయంనకు ఒక పర్యాయం గణేష్ సదన్ నుంచి అన్నదాన భవనం మీదుగా క్యూ కాంప్లెక్స్ వరకు భక్తులను చేరవేయుటకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయుచున్నట్లు ఈవో తెలిపారు.

నేటి నుంచి ఉచిత బస్సులను భక్తుల సౌకర్యార్థం చేరవేసేందుకు ట్రాన్స్ పోర్ట్ విభాగం అధికారులను ఆదేశించారు.

సర్వే పూర్తయిన వెంటనే సమగ్ర కులాల లెక్కలు బహిరంగంగా ప్రకటించాలి

-బిసి జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ తో మాట్లాడుతూ స్థానిక సంస్థల ప్రెస్ న్యూస్); సమగ్ర కుటుంబ సర్వే ఎన్నికలతో పాటు, విద్యా, ఉద్యోగ, పూర్తయిన వెంటనే సమగ్ర కులాల ఉపాధి, ఆర్థిక, పారిశ్రామిక,, ప్రైవేట్ లెక్కలు బహిరంగంగా ప్రకటించాలని రంగాలతో పాటు, చట్టసభలలో కూడా, బిసి జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బీసీలకు జనాభా దామాషా ప్రకారం బూరుగుపల్లి కృష్ణ యాదవ్ డిమాండ్ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ మేరకు బుదవారం చేసారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో మాసబ్ ట్యాంకులోని బీసీ సంక్షేమ ప్రకటించిన ప్రకారం బీసీ సబ్ ప్లాన్ భవన్ కార్యాలయంలో డెడికేషన్ ఏర్పాటు చేసి, బీసీల అభివృద్ధి కోసం కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వం ప్రతి వార్షిక బడ్జెట్ లో 50వేల కోట్లు రావును కలిసివినతి పరెం సమర్పించా కేటాయించాలని, స్థానిక సంస్థలరు. అనంతరం ఆయన మీడియా ఎన్నికలలో 42 శాతం కాకుండా జనాభా దామాషా నిష్పత్తిన రిజర్వేషన్లు కల్పించాలని లేనియెడల బీసీ జాగ్రత్తగా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీ గురుకులాలలో మౌలిక వసతుల లేమి తోపాటు ఆహార కల్తీ వల్ల విద్యార్థులు అస్వస్థత గురవుతున్నారని , రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

అంతర్గత రోడ్ల నిర్మాణం చేపడతాం : ఎమ్మెల్యే వివేక్

ఆదిలాబాద్, నవంబర్ 21:మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలోని అంతర్గత రోడ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో చేపడతామని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈరోజు ఉదయం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నుండి జాతీయ రహదారి వరకు రూ.కోటి 99 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

అనంతరం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో అమృత్ 2.0 ద్వారా నిర్మించనున్న వాటర్ ట్యాంక్ స్థల పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజ్, అంతర్గత రోడ్ల నిర్మాణం ఒక్కొక్కటిగా పూర్తి చేసి పట్టణ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చెన్న సూర్య నారాయణ, బషీరొద్దిన్, అఖిల్, హేమావంత్ రెడ్డితో పాటు శ్రీనివాస్ రెడ్డి, చెన్న వెంకన్న, పాతర్ల నాగరాజు, నాయకు,లు కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులందరికీ మంచి రోజులే- ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి, నవంబర్ 21 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులందరికీ మంచి రోజులు వచ్చాయని.. మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్యకార సోదరులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మత్స్యకార కుటుంబాలను BC-D గ్రూప్ నుంచి A గ్రూప్ లోనికి మార్చడం, చేపల వేట చేసుకునే మత్స్యకారులందరికీ చెరువులపై పూర్తి హక్కులు కల్పించడం, ఉచిత చేపపిల్లలను పంపిణీ చేయడం లాంటి అనేక కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. మత్స్యకారులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంచి రోజులు రానున్నట్లు పేర్కొన్నారు.

మత్స్య సహకార సంఘాల సభ్యులకు, మత్స్యకారులకు, మహిళలకు, మత్స్యకార యువకులకు, ఎమ్మెల్యే ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

పది విద్యార్థులకు ఊరట.. తెలుగులో పరీక్ష రాసేందుకు అనుమతి

-2020-21లో పాఠశాలల్లో 1 నుంచి 6 తరగతులను ఇంగ్లీష్ మీడియంకు మార్పు

-అప్పటి నుంచి ఒక్కో తరగతి ఇంగ్లీష్ మీడియం వర్తింపు

-ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలంటూ ఉత్తర్వులు

-సుప్రీం కోర్టును ఆశ్రయించిన విద్యార్థుల పేరెంట్స్

-దీంతో ఈ ఏడాదికి తెలుగులో పరీక్షకు గ్రీన్ సిగ్నల్

అమరావతి, నవంబర్ 21:ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. వారు కావాలనుకుంటే పబ్లిక్ పరీక్షలు తెలుగు మాధ్యంలోనే రాసుకోవచ్చని తెలిపింది. ఇప్పటికే సమర్పించిన దరఖాస్తుల్లో ఈ మేరకు సవరణలు చేసుకోవచ్చని పేర్కొంది. అయితే, ఇది ఈ ఒక్క ఏడాదికే పరిమితం కానుంది.

2020-21లో ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 6 తరగతులను ఇంగ్లీష్ మాధ్యమంలోకి మార్చుతూ అప్పటి సర్కారు ఆదేశాలిచ్చింది. ఆ తర్వాత ఒక్కో తరగతిని ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతున్నట్టు ప్రకటిస్తూ పదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులు ఇంగ్లీష్ మాధ్యమంలోనే పరీక్షలు రాయాలనే నిబంధన విధించింది. అయితే, సుప్రీంకోర్టులో ఈ విషయంపై కేసు దాఖలు 'కావడంతో 'ఇంగ్లీష్ మీడియం అని చెప్పకుండా 'ఒకే మాధ్యమం' ఉండాలని ఆదేశించింది. ఒకే మాధ్యమం అని చెప్పి, అది ఏ మాధ్యమం అన్న విషయంలో స్పష్టత లేకపోవడంతో చాలా పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం రెండింటినీ కొనసాగించారు. ఈ నేపథ్యంలో తెలుగులో చదివిన విద్యార్థులు తెలుగులో పరీక్షలు రాసేందుకు అనుమతివ్వాలంటూ ఉపాధ్యాయులు కోరడంతో స్పందించిన ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదికి తెలుగులో పరీక్షలు రాసే అవకాశాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.

నేటి నుండి ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాలు..

-ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ గారి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నవంబర్ 21 తేది నుండి 24 తేది వరకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు ప్రారంభించనున్నారని చైర్మన్ మెట్టు సాయికుమార్ గారు తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రులు శ్రీధర్ బాబు, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్ గారు,సీతక్క, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారు హాజరు కానున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు కూడా పాల్గొననున్నట్లు చైర్మన్ మెట్టు సాయికుమార్ గారు పేర్కొన్నారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నందు మత్స్యకారులు వివిధ రకాల ఫిష్ వంటకాలు చేసి ప్రదర్శిస్తారని, ప్రతిభ కనబర్చిన మత్స్యకారులు ప్రముఖుల చేత అవార్డులు అందుకుంటారని తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో నవంబర్ 21వ తేది నుండి నవంబర్ 24 వ తేది వరకు నాలుగు రోజుల పాటు ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతుందని అన్నారు. ఈ నెల 21వ తేది నుండి 24వ తేది వరకు హైదరాబాద్ లోని డా.బి ఆర్ అంబేద్కర్ విగ్రహం గ్రౌండ్ దగ్గర, ఐమాక్స్ థియేటర్ పక్కన జరగబోయే ఈ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఉత్సవాలకు రాష్ట్రంలోనున్న నలుమూలల నుండి మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు.

టెక్నాలజీ పరంగా ఆరోగ్య రంగంలో భారతదేశం చురుగ్గా పని చేస్తోంది: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 21:ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యాన్ని ఇచ్చినప్పుడే భూమి మేలైన ఆవాసంగా మారుతుందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. టెక్నాలజీని సమన్వయ పరచడానికి ప్రథమ ప్రాధాన్యాన్ని ఇస్తూ, ఆరోగ్య సంరక్షణ రంగంలో భారతదేశం క్రియాశీలంగా ముందుకు సాగిపోతోందని ఆయన అన్నారు. ఈ విషయంలో ప్రపంచమంతటా జరుగుతున్న కృషిని భారత్ బలపరుస్తుందని ఆయన ప్రధానంగా చెప్పారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అదనోమ్ ఘెబ్రెయసస్ వ్యక్తం చేసిన అభిప్రాయానికి శ్రీ నరేంద్ర మోదీ ప్రతిస్పందిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ కింది విధంగా పేర్కొన్నారు.

ఆరోగ్యకరమైన ప్రజలతో కూడిన భూగోళం గొప్పది. ఆరోగ్య సంరక్షణ రంగంలో భారతదేశం చురుకుగా పని చేస్తోంది. మేం టెక్నాలజీని సమన్వయ పరచడానికి ప్రాధాన్యాన్ని ఇస్తున్నాం. అదే సమయంలో ప్రపంచ దేశాలు చేస్తున్న కృషికి మా వంతు తోడ్పాటును అందిస్తాం'' ఏఆతీవటతీనీబ"

జార్జ్‌టౌన్‌లో ప్రధానమంత్రికి స్వాగతం పలికిన గయానా అధ్యక్షుడు

న్యూఢిల్లీ, నవంబర్ 21:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ నెల 20-21 తేదీలలో గయానాలో అధికారిక పర్యటన నిమిత్తం ఈ రోజు జార్జ్‌టౌన్ చేరుకొన్నారు. గత 56 సంవత్సరాలలో భారతదేశ ప్రధాని గయానాను సందర్శించడం ఇదే మొదటిసారి. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి విమానాశ్రయంలో గౌరవ సూచకంగా గయానా అధ్యక్షుడు డాక్టర్ మొహమద్ ఇర్ఫాన్ అలీ, గయానా ప్రధాని శ్రీ బ్రిగేడియర్ (రిటైర్డ్) మార్క్ ఆంథోనీ ఫిలిప్స్ సాదరంగా సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. గయానా ప్రభుత్వంలోని 12 మందికి పైగా కేబినెట్ మంత్రులు కూడా వారితోపాటు ఉన్నారు.

అనంతరం హోటల్ కు చేరుకున్న ప్రధానికి గయానా అధ్యక్షుడు డాక్టర్ మొహమద్ ఇర్ఫాన్ అలీతోపాటు బార్బడాస్ ప్రధాని శ్రీ మియా అమోర్ మోట్ లీ, గ్రెనెడా ప్రధాని శ్రీ డికాన్ మిశెల్ కూడా స్వాగతం పలికారు. గయానా కేబినెట్ మంత్రుల సమక్షంలో భారతీయులు, ఇండో-గయానా ప్రవాసులు అమిత ఉత్సాహంతో ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి హృదయ పూర్వకంగా ఆహ్వానం పలికారు. విమానాశ్రయం నుంచి హోటల్ కు చేరుకునే వరకు... గయానాలో పూర్తి మంత్రిమండలి ఈ స్వాగత కార్యక్రమాలలో పాలుపంచుకున్నది. భారత దేశం, గయానాల సన్నిహిత మైత్రికి గుర్తుగా జార్జ్‌టౌన్ నగర పాలకుడు... 'జార్జ్‌టౌన్ సిటీ తాళం చెవి' జ్ఞాపికని ప్రధానమంత్రికి బహుకరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి..

కరీంనగర్, నవంబర్ 21: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం శంషాబాద్ స్టేజ్ వద్ద గురువారం చోటుచేసుకుంది.

కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై శంకరపట్నం మండలం చింతగుట్ట గ్రామానికి చెందిన కర్క మల్లారెడ్డి(65) శంకరపట్నం వైపు వెళ్తుండగా వరంగల్ వైపు నుండి వస్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మల్లారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

విమర్శ నుంచి అర్థం వరకూ... సినిమాలను సమీక్షించడం ఎలా..?

న్యూఢిల్లీ, నవంబర్ 21:గోవాలో ఈరోజు ప్రారంభమయ్యే 55వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం-ఇఫీ వేడుకల నేపథ్యంలో, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ విభాగం 'పత్రికా సమాచార కార్యాలయం' (పిఐబి), పూణే ఫిలిం అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐ) సంయుక్త భాగస్వామ్యంలో నిన్న మీడియా ప్రతినిధుల కోసం ఆసక్తికరమైన సదస్సు ఏర్పాటయ్యింది. 'రివ్యూయింగ్ ఫిలిమ్స్, ఫ్రమ్ క్రిటికింగ్ టు రీడింగ్ సినిమా' పేరిట ఏర్పాటైన ఈ సదస్సును ఇఫీ మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సినిమా కళకు చెందిన వివిధ అంశాల పట్ల అవగాహన పెంపు, సినిమాను సంపూర్ణంగా అవగాహన చేసుకుని అందులోని అనుభూతిని, లోటుపాట్లను గ్రహించడం ఎందుకు ముఖ్యమో కోర్సు తెలియజెప్పింది. ఎఫ్టిటిఐకు చెందిన మాలినీ దేశాయ్, డాక్టర్ ఇంద్రనీల్ భట్టాచార్య, ప్రొఫెసర్ అమ్లాన్ చక్రవర్తి వంటి సినీ పరిశ్రమ ప్రముఖులు కోర్సుకి నేతృత్వం వహించారు.

'ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఫిల్మ్ అనాలసిస్' ప్రసంగం ద్వారా సినిమా విమర్శలో పాటించవలసిన సూత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ ఇంద్రనీల్ భట్టాచార్య ప్రతినిధులకు పరిచయం చేశారు. 'ఎడిటింగ్ యాజ్ ఎన్ ఆర్టిస్టిక్ టూల్' అన్న అంశంపై ప్రసంగించిన ప్రొఫెసర్ అమ్లాన్ చక్రవర్తి, సినిమా నిర్మాణంలో 'కూర్పు' కళాత్మక సాధనంగా ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. 'లైటింగ్ యాజ్ ఎ డ్రమాటిక్ టూల్' అనే ఆసక్తికర ప్రసంగంలో ప్రొఫెసర్ మాలినీ దేశాయ్ ఛాయాగ్రహణంలో భాగమైన లైటింగ్ (వెలుగు నీడల కూర్పు) ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు.

"సినిమాలోని కళాత్మకతను అంచనా వేయడం అంటే సినిమాని ఆరాధించడమే కాదు..అది అర్థం చేసుకోవడానికి సంబంధించినది. ప్రతి సినిమానీ ప్రేక్షకుడిని మెప్పించడం కోసమే తీస్తారు. కానీ, కొన్ని సినిమాలు మాత్రమే జీవితాంతం మీతో ఉంటాయి. అలా ఎందుకన్నది తెలుసుకోవాల్సిందే మిరే" అని ప్రొఫెసర్ అమ్లాన్ చక్రవర్తి విశ్లేషించారు. 2025 ఆస్కార్ పోటీలకు అధికారికంగా వెళ్లిన "లాపతా లేడీస్" సినిమాను ఉదాహరణగా తీసుకుని, సినిమాలో అంతర్లీనంగా దాగివుండే సామాజిక దృక్కోణాల గురించి విశ్లేషించారు. లఘుచిత్రాల నిర్మాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, కథా సంవిధానాన్ని తెలియజేసే విభిన్న పద్ధతుల గురించి ప్రొఫెసర్ భట్టాచార్య వివరించారు.

ఇఫీలో పాల్గొంటున్న పాత్రికేయులకు ఎన్నెఫ్డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రీతుల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా ప్రచారంలో మీడియా భాగ్యస్వామ్యం ఎంతో ముఖ్యమైందనీ, ఫిలిమ్ అప్రీసియేషన్ కోర్స్ సినిమాలను మరింత లోతుగా అర్థం చేసుకునేందుకూ, సినిమా గురించి చక్కని అవగాహనతో విమర్శనాత్మకంగా రాసేందుకు దోహదపడుతుందనీ చెప్పారు.

అనంతరం సమాచార ప్రసార శాఖ పశ్చిమ జోన్ డైరెక్టర్ జనరల్ స్మితా వత్స్ శర్మ ప్రసంగిస్తూ.... ఈ సదస్సు గోవా ప్రతినిధులకు మాత్రమే పరిమితం కాదని, అఖిల భారత మీడియా ప్రతినిధులందరూ ఆహ్వానితులేనని చెప్పారు. మన సినిమాల గురించి సినీ పాత్రికేయులు దేశంలోనే కాక విదేశాల్లో సైతం ప్రచారాన్ని సమర్థంగా నిర్వహిస్తున్నారని ప్రశంసిస్తూ, వారి అవగాహనను మరింత పెంపొందించేందుకు ఇఫీ ఈ కోర్సును పరిచయం చేసిందన్నారు. సదస్సును ఏర్పాటు చేయడంలో సహకరించిన ఎఫ్టిటిఐకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

పిఐబి ముంబయి శాఖ జాయింట్ డైరెక్టర్ సయ్యద్ రబీహాష్మీ మాట్లాడుతూ.... సినిమాలను కేవలం వేడుక చేసుకోవడమే కాకుండా వాటిలోని సూక్ష్మమైన అంశాలను మరింత లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ప్రొఫెసర్ మాలినీ దేశాయ్ సదస్సు ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ, సినిమాలకు సంబంధించిన చర్చ సహా కళాత్మక మాధ్యవంగా సినిమా ప్రభావాన్ని అర్థం చేసుకోవడంలో మీడియా పోషిస్తున్న పాత్ర ఎంతో ముఖ్యమైనదని అన్నారు. "దర్శకులుగా మేం సినిమా ద్వారా ప్రేక్షకులకు మా దృష్టి కోణాన్ని చేరవేస్తుంటే, పాత్రికేయులు దానిని మీడియా ద్వారా ప్రేక్షకులకు అందిస్తున్నారు. భిన్నమైన మాధ్యమాలకు చెందిన వీరిరువురి మధ్య ఏర్పాటైన ఈ సదస్సు ఇరువర్గాల వారి దృష్టి కోణాలను సుసంపన్నం చేస్తోంది" అని మాలినీ దేశాయ్ అన్నారు.

"సినీ జర్నలిస్టుల అవగాహనను పెంపొందించేందుకు మంత్రిత్వశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రయోజనకరంగా ఉంది. ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని జరగాలని ఆకాంక్షిస్తున్నాను" అని స్క్రీన్ గ్రాఫియా' మీడియా ప్రతినిధి హర్షిత వ్యాఖ్యానించారు. 1999 నుంచి ఆమె ఇఫీ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు.

గత నాలుగు దశాబ్దాలుగా ఇఫీలో పాల్గొంటున్న సీనియర్ జర్నలిస్టు సత్యేంద్ర మోహన్ మాట్లాడుతూ.... "1983 నుంచి ఇఫీలో పాల్గొంటున్నాను. నేటి సదస్సు ఎంతో ఆసక్తికరంగా కొనసాగి విలువైన సమాచారాన్ని అందించింది. సినిమాలని మరింత లోతుగా అర్థం చేసుకోవడంలో జర్నలిస్టులకు ఈ సదస్సు ఉపకరిస్తుంది. 55వ ఇఫీ స్థాయిని పెంచిన కార్యక్రమమిది" అన్నారు.

మానస ఆర్ట్స్ థియోటర్స్ కార్యదర్శి రఘుశ్రీకి ఉత్తమ ఆధ్యాత్మిక సేవ పురస్కారం

బాసర నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలో శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపములో శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము(కోటి పార్థివలింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరము) మాసో త్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమములు, అధ్యాత్మిక ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు వైభవం గా జరిగినవి. ముందుగా లక్ష్మీ గణపతి, వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య, కోటి పార్థివ లింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకము , కుంకుమార్చన ,గణపతి, నవగ్రహ ,రుద్ర ,సరస్వతి హోమములు, భూదాన సంకల్ప పూజ, మరియు అన్నప్రసాద వితరణ ఘనంగా జరిగింది..సాంస్కృతిక కార్యక్రమములో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన నాట్య గురువులు, శ్రీ సాయి కృప మ్యూజిక్ అండ్ డాన్స్ హబ్బిస్ స్కూలు వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ పాలకుర్తి వసంత లక్ష్మీ శిష్య బృందం చేసిన నాట్య ప్రదర్శన మరియు భక్తి సంగీత విభావరి శ్రోతలను ఆకట్టుకున్నది. ఈ సందర్భమూ గా మానస ఆర్ట్స్ థియోటర్స్ కార్యదర్శి మరియు కవి రచయిత శ్రీ రఘు శ్రీ, కి,సృజన, స్పందన, ఆర్తన , సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అంజనా చౌదరి కి, మరియు సంగీత,నాట్య గురువు శ్రీ పాలకుర్తి వసంత లక్ష్మీ లకు ఉత్తమ ఆధ్యాత్మిక భక్తి సేవా పురస్కారము శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి వ్యవస్థాపక అధ్యక్షులు శివ శ్రీనిర్మల సంధ్య అంబికానాథ శర్మ దంపతులు అందజేసినారు. ఉత్తమ ఆధ్యాత్మిక సేవ పురస్కార గ్రహీత మానస ఆర్ట్స్ థియోటర్స్ కార్యదర్శి రఘు శ్రీ కవి, రచయిత సభలో మాట్లాడుతూ బాసర సరస్వతి క్షేత్రములో ఈ పురస్కారం తీసుకొ?వడము ఆనందము గా ఉన్నదని మరియు శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమములో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రతి నెల మాసోత్సవము భాగము గా పూజ కార్యక్రమములు, సంగీత, సాహిత్య,నృత్య, ధార్మిక , ఆధ్యా త్మిక కార్యక్రమాలు నిర్వహించడం చాలా గొప్ప విషయంనని ప్రశంసించారు. హైదరాబాద్ వాస్తవ్యులు భౌతిక శాస్త్ర అధ్యాపకులు వెంకటేష్ , సతీష్ చంద్ర, ఎస్పీ కోటేశ్వర్, సుబ్రమణ్యం, బాల్రాజ్, యం మాధవి, కె వరలక్ష్మి ,అనూషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో మంచి నాయకులను తయారు చేసింది సేవాదల్

- దేశంలో ఆర్ఎస్ ఎస్ ను ధీటుగా ఎదుర్కొంది సేవాదల్ మాత్రమే

- ఒక వైపు మోడీ ,మరొకవైపు అమిత్ షాలు దేశానికి పట్టిన శని

-అఖిలభారత సేవాదల్ అధ్యక్షులు లాల్జ్ జి దేశాయ్

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సేవాదల్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా గాంధీ భవన్ లో సేవాదల్ 100 సంవత్సరాల ఉత్సవాలు ఘనంగా ప్రారంబమైనాయి. సేవాదల్ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాలకు జాతీయ అధ్యక్షుడు లాల్ జి దేశాయ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. కాంగ్రెస్ లో మంచి నాయకులను సేవాదల్ తయారు చేసిందన్నారు. సేవాదల్ ఉన్నది ప్రజలకు సేవ చేసేందుకుప్రతి సేవాదల్ కార్యకర్త కష్టపడి కాంగెస్ అభివృద్ధి కోసం పనిచేయాలిగుజరాతీలు దేశాన్ని లూటీ చేస్తున్నారుఒక వైపు మోడీ ,మరొకవైపు అమిత్ షాలు దేశానికి పట్టిన శని మోడీ,అమిత్ షాలను గద్దె దించాలని రాహుల్ గాంధీని ప్రధాని చేయాలిపిలుపు నిచ్చారు. రాహుల్ గాంధీ దేశ ప్రధాని అయ్యేవరకు ప్రతి సేవాదల్ కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం మాజీ ఎంపీ..మధుయాష్కీ గౌడ్మాట్లాడుతూ ఒక సేవాదల్ కార్యకర్తగా నేను గర్వపడుతున్నసేవాదల్ 100 సంవత్సరాల ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో ఖీూ సేవాదల్ ధీటుగా ఎదుర్కొందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సేవాదల్ కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పుడు కొంచెం సేవాదల్ కార్యక్రామాలు తగ్గాయని,ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సేవా దళ్ మరింత కృషి చేయాలన్నారు.వచ్చే ఐదేండ్లు కూడా కాంగ్రెస్ తెలంగాణ లో అధికారంలోకి వచ్చేందుకు సేవాదల్ కష్టపడి పనిచేయాలిఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు కేశవ రావ్, మాజీ పీసీసీ అధ్యక్షులు వి. హనుమంతరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత,సురేందర్,మ్యాజిజెట్ వెంకాట్ ,ప్రకాష్ ,రేసు కుమార్,దయాకర్, రామ కాంత్ తదితరులు పాల్గొన్నారు

జి20 లోని అనేక దేశాలు, అతిథి దేశాలతో పాటు అంతర్జాతీయ సంస్థల సమర్థన

న్యూఢిల్లీ, నవంబర్ 21:ప్రపంచ వృద్ధి 3 శాతాని కంటే కాస్త ఎక్కువ మాత్రమే నమోదయింది. ఇది ఈ శతాబ్దం మొదలైన తరువాత నుంచి చూస్తే అత్యంత తక్కువ. మహమ్మారికి ముందు కాలంలో ఇది సగటున సుమారు 4 శాతం గా ఉండింది. దీనికి తోడు, టెక్నాలజీ ఊహించినదాని కంటే వేగంగా వెళుతోంది. టెక్నాలజీని సమాన స్థాయిలలో న్యాయబద్ధంగా ఉపయోగించుకోవడం ద్వారా వృద్ధిని పెంచడానికీ, అసమానతలను తగ్గించడానికీ, స్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీస్) సాధనలో అంతరాన్ని పూడ్చే దిశలో ఒక పెద్ద అడుగు వేయడానికీ ఒక చరిత్రాత్మక అవకాశాన్ని మనకు అందిస్తుంది.

స్థిరాభివృద్ధి లక్ష్యాల బాటలో వేగంగా సాగిపోవడానికి డిజిటల్ మార్పును అన్నిటా ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. సువ్యవస్థిత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)కు జతగా కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని పెంచితే అభివృద్ధి పథంలో పురోగమించడానికి సమాచారాన్ని ఉపయోగించుకొనే వీలు చిక్కడంతో పాటు కొత్త ఉద్యోగావకాశాలను సృష్టించవచ్చని, మెరుగైన విద్యను, ఆరోగ్య సేవలను అందించవచ్చని జి20లోని అనేక సభ్య దేశాలు నిరూపించాయి. జి20 లో మిగిలిన దేశాలు కూడా వారి పౌరుల జీవనంలో పెనుమార్పులను తీసుకు వచ్చినట్లయితే చైతన్యశీల ప్రజాస్వామిక సిద్ధాంతాల పట్ల పౌరులలో విశ్వాసాన్ని తిరిగి పెంచవచ్చును. ఈ కారణంగా మేం యూఎన్ సమిట్ ఆఫ్ ది ఫ్యూచర్‌లో గ్లోబల్ డిజిటల్ కంపేక్ట్ ను ఆమోదించిన సంగతిని మరోసారి గుర్తుకు తెస్తున్నాం. 2024లో ఈజిప్టు లోని కైరోలో జరిగిన గ్లోబల్ డీపీఐ సమ్మిట్‌ను కూడా మేం స్వాగతిస్తున్నాం.

టెక్నాలజీ వ్యవస్థలు వాటి ప్రయోజనాలను దేశంలో ప్రతి వ్యక్తికి అందించి ప్రజల జీవనాన్ని మెరుగు పరచడానికి వారితో చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు అనుబంధాన్ని ఏర్పరచుకొన్నప్పుడే ఉద్యోగాల కల్పనతో కూడిన వృద్ధి ప్రయోజనాలను పొందవచ్చును. ఈ తరహా టెక్నాలజీ వ్యవస్థలు అందరికీ అందుబాటులో ఉన్నప్పుడే అభివృద్ధి ప్రధాన, వ్యక్తుల గోప్యతను పదిలపరచే, గౌరవించేవిగా రూపొందితేనే ఇది సాధ్య పడుతుంది. ఇక విపణి విషయానికి వస్తే, ఇ-కామర్స్, ఆరోగ్యం, విద్య, ఆర్థిక రంగం వంటి వివిధ రంగాలకు సేవలను అందించే ప్రైవేటు రంగం... టెక్నాలజీ వ్యవస్థతో ముడిపడవలసి వస్తుంది. దాపరికానికి చోటుండని, పరస్పర ఆశ్రితమై పని చేసే, విస్తరణకు వీలున్న తరహా టెక్నాలజీ వ్యవస్థలు రూపొందాలి. కాలం ముందుకు పోయే క్రమంలో జనాభా కూడా పెరుగుతూ, దేశాల అవసరాలు మార్పులకు లోనైనప్పుడల్లా ఈ వ్యవస్థలు ఎలాంటి ఇబ్బంది లేకుండా నూతన స్థితికి అనుగుణంగా పని చేయగలుగుతాయి.

కాలం గడిచే కొద్దీ ఎలాంటి ఇబ్బంది ఎదురుకాని విధంగా టెక్నాలజీ మారడానికిగాను మార్కెట్‌లో భాగస్తులకు సమానావకాశాలను అందించే తరహా టెక్నాలజీని అనుసరించడంతో పాటు అభివృద్ధి సాధన కోసం డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)ని, కృత్రిమ మేధ (ఏఐ)ని, డేటాను విరివిగా వినియోగించుకోవలసి ఉంటుంది. ఈ విధానం విస్తృత పోటీ, నూతన ఆవిష్కరణలు.. ఈ రెండిటినీ ప్రోత్సహించేందుకు అనుకూలమైందిగా ఉంటుంది. అంతేకాదు, మరిన్ని రంగాలలో అభివృద్ధికి స్ఫూర్తిని ఇస్తుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో అసమానత్వాన్ని తగ్గించేస్తుంది కూడా.

డేటాను పరిరక్షించడానికి ఒకవైపు డేటా నిర్వహణకు, గోప్యతకు, భద్రతకు ఎదురయ్యే బెడదల నివారణకు నిస్పాక్షిక సిద్ధాంతాల రూపకల్పన, మరో వైపు మేధో సంపత్తి హక్కుల రక్షణను, రహస్య సమాచారం బయట పడకుండా చూడడంలో సాయాన్ని మార్కెట్లోని భాగస్తులకు అందించవలసి ఉంటుంది.

ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి విశ్వాసం అత్యంత ముఖ్యం. టెక్నాలజీ వ్యవస్థలకూ ఇది వర్తిస్తుంది. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంలో ఈ టెక్నాలజీ వ్యవస్థలు వాటి కార్యకలాపాలలో దాపరికానికి తావు ఇవ్వకపోవడం, పౌరుల హక్కుల ఆదరణకు తగిన జాగ్రత్త చర్యలను తీసుకోవడం, నిస్పాక్షికంగా నడచుకోవడం కీలకం. ఈ కారణంగానే ఫౌండేషన్, ఫ్రాంటియర్ వంటి కృత్రిమ మేధ నమూనాల్లో భిన్నమైన డేటా సెట్స్ ఆధారంగా శిక్షణను ఇస్తున్నారు. తద్వారా మాత్రమే ప్రపంచంలో వేరు వేరు సమాజాలకు లబ్ధిని చేకూర్చడం సాధ్యం అవుతుంది.

మధ్యాహ్న భోజనం వికటించి 100 మందికి పైగా విద్యార్థులకు అస్వస్థత

-విద్యార్థులను ఆసుపత్రికి తరలింపు...

నారాయణపేట,నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్): నారాయణ పేట జిల్లాలోని మాగనూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో మధ్యాహ్న భోజనం వికటించి 100 మంది విద్యార్థులకు పైగా అస్వస్థతకు గురికావడం జరిగింది. బుధవారం చోటుచేసుకుంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు భోజనం చేసిన తర్వాత విద్యార్థులకు ఈ సంఘటన చోటుచేసుకుంది. ఒక్కొక్క విద్యార్థులు విరోచనాలకు గురికావడంతో తమ తమ తల్లిదండ్రులకుతెలిపారు.దీంతో పాఠశాలకు హాజరవిడిన తల్లిదండ్రులు చేరుకోవడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు నిలదీశారు. తమ పిల్లలనువైద్యం అందించేందుకు మక్తల్ పట్టణానికి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించినట్లు సమాచారం. ఇట్టి విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు నారాయణపేట జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్...అధికార వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి

-రాయలసీమలోనే అవకాశాలు ఎక్కువ
-కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు తీర్మానం
-ఏకసభ్య తీర్మానాన్ని ఆమోదించిన అసెంబ్లీ
-మిషన్ రాయలసీమతో సస్యశ్యామలం చేస్తాం
-అసెంబ్లీలో స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 21:అధికార వికేంద్రీకరణతో అన్ని ప్రాంతాల్లో సమగ్రాభివద్ధి సాధ్యమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటునకు నిర్ణయించామని, ఏపీ హైకోర్టు శాశ్వత బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ కేంద్రానికి తీర్మానం పంపడంపై శాసనసభలో చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బుధవారం కేబినెట్‌లో చర్చించి ఆమోదం తెలిపామని.. లోకాయుక్త , స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్ లాంటివి అక్కడే ఉంటాయన్నారు. అమరావతి కూడా చాలా సార్లు చెప్పామని.. మూడు రాజధానులు అని చెప్పి మూడు ముక్కలాట ఆడారని మండిపడ్డారు. మన రాజధాని అమరావతి అని విశాఖ, కర్నూలు వాసులు కూడా ఆమోదం తెలిపారన్నారు. రాయలసీమ రాళ్ల సీమగా మారిపోతుంది అని అనుకున్నప్పుడు బచావత్ అవార్డు ప్రకారం రాయలసీమకు నీళ్లు తీసుకువెళ్ళామన్నారు. తెలుగుగంగా, హంద్రీనీవా, సగరీ, గాలేరు ప్రాజెక్టులను టీడీపీ ప్రారంభించి పూర్తిచేసిందన్నారు.

రాయలసీమకు ఉన్న అవకాశాలు చాలా ఎక్కువ అని.. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ఎయిర్ పోర్టులు రాయలసీమకు దగ్గర అని తెలిపారు. ఈ అవకాశాలను ఉపయోగించుకుంటే సీమ అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. తిరువతి, కడప, ఓర్వకల్లు, పుట్టపర్తిలలో నాలుగు ఎయిర్ పోర్టులు రాయలసీమలోనే ఉన్నాయన్నారు. రాయలసీమను ఎడ్యూకేషన్ హబ్‌గా చేయడానికి ఎంతో ముందుకు వెళ్లిందన్నారు. మిషన్ రాయలసీమలో చెప్పిన ప్రతి హామీని ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిచేస్తుందని తెలిపారు. రాయలసీమలో నీటి సమస్యను ఎదుర్కోనేందుకు డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇచ్చామన్నారు. తిరుపతి హార్డ్ వేర్ హబ్‌గా తయారైతే కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులను కేంద్రం ఇస్తే.. రెండు రాయలసీమలో పెట్టామన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీని పెట్టడంతో పాటు కర్నూలు నగరం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈరోజు హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో పెట్టడానికి నేడు సభలో తీర్మానం చేస్తున్నామని.. సభ్యులు ఈ తీర్మానాన్ని సమర్థించాలని కోరుతున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై చేసిన తీర్మానాన్ని ఏపీ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తీర్మానాన్ని మంత్రి ఎండీఫరూక్ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ప్రయత్నం ఎంతో ఆనందించదగ్గ పరిణామమన్నారు. వైసీపీ వచ్చాక మూడు రాజధానులు పేరుతో కర్నూలులో న్యాయ రాజధాని అని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. రాయలసీమ వాసులను నిలువునా మోసం చేశారని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి పై విరుచుకుపడ్డారు. అప్పట్లో 22మంది ఎంపీలున్నా హైకోర్టు తరలింపుకు ఎలాంటి చర్య చేయలేదన్నారు. న్యాయ రాజధాని కర్నూలు అని జగన్ అంటారని.. అదే జగన్ ఏపీ జుడిషియల్ అకాడమీని మంగళగిరిలో ఏర్పాటు చేస్తున్నట్లు జీవో ఇచ్చారని తెలిపారు. జగన్ రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయారని చెప్పారు.

తక్కువ వనరులతో ఎక్కువ ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయండి

-భారతీయ వ్యవసాయానికి సమాంతరంగా ఏ విజయగాథలు లేదు
- భారతదేశం యొక్క ప్రపంచ ఆధిపత్యం వ్యవసాయ వస్తువుల అంతటా విస్తరించింది
- ఆహార వృధాలో అమెరికా, చైనా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది.
-కావేరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, డాక్టర్ వి ప్రవీణ్ రావు
-బయోలాజికల్స్ తదుపరి వ్యవసాయ సాంకేతిక విప్లవం: డాక్టర్ రోజర్ త్రిపాఠి

హైదరాబాద్, నవంబర్ 21(ఎక్స్ ప్రెస్ న్యూస్); బయో అగ్రి ఇన్‌పుట్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఃఎఖం) బయో అగ్రి 2024 యొక్క 4వ ఎడిషన్, సుస్థిర జీవ వ్యవసాయానికి అంకితమైన ప్రీమియర్ కాన్ఫరెన్స్ మరియు ఎక్స్‌పో రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి ఇతివృత్తం "జీవ వ్యవసాయం: ప్రకృతి విజ్ఞతను ఉపయోగించడం".భారతదేశం, జూం మరియు ఇతర దేశాలలోని అగ్రి-ఇన్‌పుట్ పరిశ్రమ నుండి 250 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. రెండు రోజుల్లో 35 స్పీకర్ సెషన్లు మరియు ప్యానెల్ చర్చలు ఉన్నాయని ఃఎఖం ప్రెసిడెంట్ డాక్టర్ ఐఖీఐ రెడ్డి తన ప్రారంభ వ్యాఖ్యలలో తెలిపారు. 'వాతావరణ మార్పుల యుగంలో వ్యవసాయ పరివర్తనకు నేల మరియు నీటి నిర్వహణ పరిష్కారాలు' అనే అంశంపై మొదటి ప్రధాన ఉపన్యాసం చేస్తూ, కావేరీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి ప్రవీణ్ రావు, తక్కువ వనరులతో ఎక్కువ ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయాలని పరిశ్రమను కోరారు.

1960 నుండి 2023 వరకు, భారతీయ వ్యవసాయానికి సమాంతరంగా ఏ విజయగాథలు లేవు. భారతదేశం యొక్క ప్రపంచ ఆధిపత్యం అన్ని వ్యవసాయ వస్తువులపై విస్తరించింది. వ్యవసాయ-ఎగుమతులు 53.15 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. భారతదేశం 550 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే, ఈ విజయానికి తగిన మూల్యాన్ని కూడా చెల్లిస్తున్నాము . అందుకు చాలా సవాళ్లు ఉన్నాయి. 2010 నుండి 2050 వరకు ఆహార డిమాండ్ 71% పెరిగింది. ఆహార పోషకాహార భద్రత మరియు సుస్థిరత నేడు ఎందుకు ముఖ్యమైనవని ఆయన అడిగారు. భారతదేశం 274 రోజులలో 255 రోజులలో (జనవరి 1 నుండి సెప్టెంబర్ 30, 2024 వరకు) లేదా సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల్లో 93% రోజులలో అతి విపరీత వాతావరణ పరిస్థితు లను ఎదుర్కొంది. విపరీత వాతావంణ సంఘటనలు 3,238 మందిని చంపాయి మరియు 3.2 మిలియన్ హెక్టార్ల పంట విస్తీర్ణాన్ని ప్రభావితం చేశాయి మరియు 9457 జంతువులు చనిపోయాయి. భారతదేశంలోని దాదాపు 80% మంది చిన్నకారు రైతులు కనీసం ఒక వాతావరణ ప్రమాదం వల్ల ప్రభావితమయ్యే అవకాశం ఉంది. 2030 నాటికి ప్రపంచ మంచినీటి డిమాండ్ 40% సరఫరాను అధిగమిస్తుంది. నీటి డిమాండ్ 1195 బిలియన్ క్యూబిక్ మీటర్లు ఉంటుంది అని డా. ప్రవీణ్ రావు తెలిపారువాతావరణ మార్పు పంట దిగుబడిపై ప్రభావం చూపు తోంది. చాలా ఆహారం వృధా అవుతు ంది.భారతీయ ఇళ్లలో ప్రతి వ్యక్తి సంవత్సరానికి 50 కిలోల ఆహారం వృధా అవుతుంది. దాదాపు 6.7 కోట్ల టన్నుల ఆహారం వృథా అవుతోంది, దీని విలువ దాదాపు రూ. 92,000 కోట్లు. ఆహారాన్ని వృధా చేసే విషయంలో అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలో మూడో స్థానంలో ఉన్నాం. ప్రపంచ స్థాయిలో, ప్రతి సంవత్సరం ఒక బిలియన్ టన్నుల ఆహారం వృధా అవుతుంది. ప్రపంచంలోని 24% కేలరీలు ఆహారం కోల్పోవడం వల్ల తినకుండా పోతున్నామని ఆయన చెప్పారు.మరో ముఖ్య వక్త డాక్టర్ రోజర్ త్రిపాఠి, గ్లోబల్ బయోఆగ్ ఇన్నోవేషన్స్ వ్యవస్థాపకుడు ఉ అఖూ, జూ, ఆగ్రో బయోలాజికల్ దృష్టిని ఆకర్షిస్తోంది అని తెలిపారు . బయోలాజికల్స్ తదుపరి వ్యవసాయ సాంకేతిక విప్లవం. బయోలాజికల్ వ్యవసాయ ఉత్పత్తులు భవిష్యత్తులో వి240 బిలియన్ల పంట రక్షణ మరియు ఎరువుల మార్కెట్‌లో రసాయన పురుగుమందులు మరియు ఎరువుల స్థానం ను ఆక్రమిస్తాయని తెలిపారు

జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రభుత్వంలో నాయకత్వ మార్పిడి తథ్యం

- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకత్వ మార్పిడి తథ్యమని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన తీరు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టారు అందుకోసమే తన పదవి కాపాడుకునేందుకు, సోనియా గాంధీకి తనపట్ల నమ్మకం కలిగించుకునేలా ప్రసన్నం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి నానా రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ సోనియా దేవత అంటూ.. ఆమె కాళ్లు కడిగి నీళ్లు నెత్తిమీద జల్లుకోవాలంటూ.. రాహులే దేశానికి సర్వస్వమంటూ భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అయినా, కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ ను నమ్మడం లేదనే విషయంలో అనేక అంశాల ద్వారా స్పష్టమవు తున్నదన్నా లేదు.ప్రభుత్వం రైతు రుణమాఫీ రు. నిత్యం కాంగ్రెస్ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోవడం, కప్పం కట్టడంపైనే రేవంత్ కాలం గడుపుతున్నారంటూ విమర్శించారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన తీరుపై ఎన్.వి.ఎస్.ఎస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.అసలు తెలంగాణ రాష్ట్రానికి రాహుల్ ముఖ్యమంత్రా.. లేక రేవంత్ రెడ్డా... అన్న అనుమానం ప్రజల్లో నెలకొందని ఎన్.వి.ఎన్.ఎన్ విమర్శించారు.

ఒకరోజు గడిస్తే చాలనే ఆలోచనలో రేవంత్ రెడ్డి..... హమ్మయ్య..! ఈరోజు గడిచిందనే భావనలో ప్రజలు ఉన్నట్లుగా అభివర్ణించారు. రేవంత్ రెడ్డి.. తన పదవిని కాపాడుకోవడానికే ప్రాధాన్యతనిస్తూ పాలనను గాలికొదిలేశారని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో ప్రభుత్వం ఎక్కడ తమ భూములను గుంజుకుంటుందోనని, ఇల్లు కూలగొడుతుందేమోననే భయంలో ప్రజలు ఉన్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యమంటే.. కూలగొట్టడం, కొల్లగొట్టడం.. దోచుకోవడం, దాచుకోవడం.. భూములు అమ్మడం, బీర్లు అమ్మడమేనా అంటూ ఎన్.వి.ఎన్.ఎన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల కోసం పాలన చేయకుండా ఇతర రాష్ట్రాల్లో రాజకీయాల కోసం, ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశాలను మెరుగుపర్చుకోవడం కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చుకున్నారంటూ ఆరోపించారు. ఏడాది కాలం నుంచి మంత్రివర్గ విస్తరణ చేసి, కీలక శాఖలను తనవారికి అప్పజెప్పాలని పదేపదే కేంద్రాన్ని ప్రాధేయపడుతున్నా రేవంత్ కు అనుమతి ఇవ్వడం లేదు.రాష్ట్రాన్ని పాలిస్తున్నది ఎవ్వరనేది తెలంగాణ ప్రజల్లో సంశయం నెలకొంది.వీసీల నియామకం కావాలన్నా.. కార్పొరేషన్ల నియామకం జరగాలన్నా.. పదాధికారుల నియామకం జరగాలన్నా, మంత్రివర్గ విస్తరణ చేయాలన్నా ఫైలు పట్టుకుని ఢిల్లీకి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కాంట్రాక్టు రాహుల్ గాంధీ చెప్పినట్లుగానే రేవంత్ ముందుకెళుతున్నదు.కులగణన, రైతు రుణమాఫితో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాల విషయంలో అదే తంతు నడుస్తున్నది.అసలు తెలంగాణ రాష్ట్రానికి రాహుల్ ముఖ్యమంత్రా.. లేక రేవంత్ రెడ్డా...?రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇయ్యలేదు.ఒక్క విద్యార్థికి కూడా ఫీజు రీయింబర్స్ మెంట్ చేసిన దాఖలాల్లేవు.ప్రభుత్వ బకాయిల కారణంగా ఏ ప్రైవేటు ఆసుపత్రిలో కూడా ఆరోగ్య శ్రీ ని సక్రమంగా అమలు చేయడం లేదు. దీనిపై సర్కారు కనీసం సమీక్షించ లేదు.ప్రభుత్వం రైతు రుణమాఫీ చెల్లించదని చెప్పి.. రైతులకు బ్యాంకు అధికారులు పాసుపుస్తకాలు తిరిగి ఇచ్చిన దాఖలాలు ఎక్కడైనా కనపడుతోందా.. ఇందిరమ్మ రాజ్యమంటే.. కూలగొట్టడం, కొల్లగొట్టడం.. దోచుకోవడం, దాచుకోవడం. భూములు అమ్మడం, బీర్లు అమ్మడంకోసమేనా..కాంగ్రెస్ సర్కారు భయానక పాలనలో రాష్ట్రంలో ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బతుకు వెల్లదీస్తున్నరు.కాంగ్రెస్ సర్కారు ఏ రోజు తమ భూములు గుంజుకుంటుందో.. ఇల్లు కూలగొడుతుందేమోననే భయంతో రోజులు గడుపుతున్న పరిస్థితి ఏర్పడింది.రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో దేవుళ్లపై ఒట్టు పెట్టి గట్టెక్కే విధంగా ఓట్లు దండుకుని పబ్బం గడుపుకున్నాడు.ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వ పథకాలు అమలు కాలే.. రుణమాఫీ అమలు కాలే.. ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు కాలేదు.దేవుడికి ఆగ్రహం వస్తుందేమోనని, తన పీఠం కదులుతుందేమోననే భయంతో రేవంత్ ఒక్కో దేవాలయాన్ని సందర్శిస్తున్నడు.మొన్న వేములవాడ, యాదాద్రి ఆలయాలను సందర్శించి చేసిన తప్పులకు చెంపలు వేసుకుని, గుంజీలు తీశాడు.మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో మన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కాంగ్రెస్ నాయకులు తెలంగాణను ఉద్ధరించామని చెప్తూ ప్రచారానికి వెళ్లారు.జార్ఖండ్, మహారాష్ట్ర ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకత్వ మార్పిడి తప్పదు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి కావొస్తున్న తరుణంలో కనీసం మంత్రివర్గ విస్తరణ జరుపుకోలేని ముఖ్యమంత్రి పాలన సాగించడం ఎందుకన్నట్లు ప్రజలు అభిప్రాయపడుతున్నరు.ఇచ్చిన హామీలు నెరవేర్చని ముఖ్యమంత్రి ఎవరి కోసం పాలన కొనసాగిస్తున్నట్లు అని ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

నేత్రపర్వంగా జైనథ్ జాతర...కమనీయం లక్ష్మీ నారాయణ రథోత్సవం

ఆదిలాబాద్, నవంబర్ 21:ఆదిలాబాద్ జిల్లా జైనథ్ లక్ష్మీ నారాయణ స్వామి జాతర ఉత్సవాలు అశేష భక్తజన సందోహం మధ్య గురువారం ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగు మహారాష్ట్ర నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించారు. పురవీధుల గుండా లక్ష్మీ సమేత శ్రీమన్నారాయున్ని డప్పుల వాయిద్యాలు భజంత్రీల మధ్య ఊరేగించి మంగళ హారతులతో స్వామివారికి భక్తులు నీరాజనం పలికారు.

భక్తుల కొంగుబంగారం లక్ష్మీనారాయనుడు..

ఆదిలాబాద్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన లక్ష్మీ నారాయణని దర్శించుకునేందుకు వేలాదిమంది భక్తులు పోటెత్తారు. కాకతీయుల నాటి 12వ శతాబ్దంలో నిర్మించిన పురాతన రాతి ఆలయంలో కొలువైన నారాయణస్వామిని ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, దేవాలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ఉత్సవాలు ప్రారంభించారు. కొలిచిన వారికి కొంగు బంగారంగా భక్తుల పూజలు అందుకునే జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి జాతర ఉత్సవాలు ఈనెల 27 వరకు కొనసాగుతాయని ప్రధాన పురోహితులు తెలిపారు. ప్రతిరోజు ఆలయంలో విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

న్యూయార్క్‌లో గౌతం అదానీపై అరెస్టు వారెంట్ జారీ!

న్యూయార్క్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్):: 265 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 2,029 కోట్లు) లంచం తీసుకున్నారనే ఆరోపణలపై న్యూయార్క్ లోని గ్రాండ్ జ్యూరీ వ్యాపార దిగ్గజం, మరో ఏడుగురిపై బుధవారం అభియోగాలు మోపిన తర్వాత, గౌతమ్ అదానీ, అతని వేనల్లుడు సాగర్ అదానీలకు యునైటెడ్ స్టేట్స్ లో అరెస్ట్ వారెంట్లు జారీ చేసినట్లు రాయిటర్స్ నివేదిక (నవంబర్ 20) పేర్కొంది.న్యాయ శాఖ యొక్క క్రిమినల్ విభాగానికి డిప్యూటీ అసిస్టెంట్ అటార్నీ జనరల్ అయిన లిసా హెచ్ మిల్లర్, అదానీ, అతని సహచరులు భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చి లాభదాయకమైన సౌరశక్తి సరఫరా ఒప్పందాలను "యుఎస్ పెట్టుబడిదారుల ఖర్చుతో అవినీతి, మోసం ద్వారా" పొందేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు.బ్లాక్స్ లా డిక్షనరీ ప్రకారం 'ఇండిక్ట్ మెంట్ అంటే , దశల వారీ ప్రక్రియను అనుసరించి, నేరం మోపబడిన పార్టీపై "అభియోగపత్రం అధికారిక వ్రాతపూర్వక ఆరోపణ". గ్రాండ్ జ్యూరీ అనేది న్యాయస్థానం యొక్క అధికార పరిధిలో నివసిస్తున్న పౌరుల "ఫెయిర్ క్రాస్-సెక్షన్" నుండి యాదృచ్ఛికంగా ఎంపిక చేయబడిన వ్యక్తులతో కూడిన ప్యానెల్, ఇది కేసును విచారించవచ్చు. ఇది న్యూయార్క్ రాష్ట్రంలో గరిష్టంగా 23 మంది వ్యక్తులను కలిగి ఉంటుంది, సాక్ష్యం వినడానికి కనీసం 16 మంది న్యాయమూర్తులు హాజరు కావాలి. "న్యూయార్క్ స్టేట్‌లో, ఒక వ్యక్తిని గ్రాండ్ జ్యూరీ అభియోగాలు మోపితే తప్ప నేరం కోసం విచారణకు తీసుకురారు."చట్టపరమైన విధానపరమైన డ్రామాలు లేదా చలనచిత్రాలలో చూసే ట్రయల్ జ్యూరీలా కాకుండా, గ్రాండ్ జ్యూరీ యొక్క ఉద్దేశ్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి అమాయకత్వం లేదా అపరాధాన్ని నిర్ధారించడం కాదు. ఒక వ్యక్తి "సహేతుకమైన సందేహానికి అతీతంగా" దోషి అని ట్రయల్ జ్యూరీ నిర్ధారించాలి, అయితే ఒక గ్రాండ్ జ్యూరీ తక్కువ ప్రమాణాన్ని కలిగి ఉండాలి. క్రిమినల్ ట్రయల్ ప్రాసెస్‌కి అదనపు దశగా, ట్రయల్‌ని నిర్వహించడానికి అవసరమైన సాక్ష్యం రికార్డులో ఉన్నట్లయితే గ్రాండ్ జ్యూరీ తప్పనిసరిగా నిర్ణయించాలి.

అప్పుల బాధ తాళలేక ఉపాధ్యాయుడు ఆత్మహత్య

వరంగల్, నవంబర్ 21: అప్పుల బాధ తాళలేక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో గురువారం జరిగింది. వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి లోని కోయవీరాపురం గ్రామానికి చెందిన చాప బుచ్చయ్య (55) పెద్ద గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో టీచర్ గా పని చేస్తున్నాడు.

ఆ వ్యక్తి అప్పుల బాధతో గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోని ఒక చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అది చూసిన గ్రామస్తులు అతడిని ఏటూరునాగారం ఆసుపత్రికి తీసుకెళ్ళేలోపు చనిపోయినట్లు అతని భార్య రమణ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు

జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలను అందజేయాలి : టీఎస్ జెయు

-జర్నలిస్ట్ సంక్షేమ పథకాలకు, అక్రిడేషన్ కార్డులకు లింకు పెట్టవద్దు..

- ప్రభుత్వ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు అమలు చేయాలి

-సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ కుమార్ కు వినతిపత్రం

హైదరాబాద్, నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జె యు)

ఆధ్వర్యంలో తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ కుమార్ కు సమర్పించిన వినతి పత్రంలో కోరారు. అన్ని జర్నలిస్ట్ యూనియన్లకు అక్రిడేషన్ కమిటీలో భాగస్వామ్యం కల్పించాలని వారు కోరారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్ యుజె(ఐ) జాతీయ ఉపాధ్యక్షులు నారగౌని పురుషోత్తం, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు, రాష్ట్ర నాయకులు క్రాంతికుమార్ లు కమిషనర్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల వృత్తి భద్రత, హక్కులను కాపాడడం ప్రభుత్వ బాధ్యతని వారు అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు వంటి అనేక సమస్యలను నివారించాలని వారు కోరారు. జర్నలిస్టుల భద్రతను సమర్థవంతంగా పరిరక్షించేందుకు జర్నలిస్టుల రక్షణ చట్టం తప్పనిసరిగా రూపొందించి అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమ పథకాలకు అక్రిడిటేషన్ లింకును తీసివేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్రిడిటేషన్ కార్డులు పొందని అనేక మంది జర్నలిస్టులు తమ వృత్తి సేవలను కొనసాగించడంలో తీవ్రమైన ఆర్థిక వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలు ప్రతి జర్నలిస్టుకు అదే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జర్నలిస్టులపై దాడుల నివారణ కోసం కమిటీలను నియమించాలని, బాధితులకు న్యాయం అందించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో కమిటీలను పునరుద్ధరించాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల, స్థలాలు కేటాయించడంలో ప్రస్తుత యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించే సంఘాలకు మాత్రమే కాకుండా ప్రభుత్వం స్వయంగా జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా చిన్న పత్రికలకు ఎంప్యానల్ మెంట్ జరగకపోవడం వల్ల చిన్న పత్రికల యజమానులు (వీరంతా జర్నలిస్టులే) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే చిన్న పత్రికలకు ఎంప్యానల్ మెంట్ చేయాలని వారు కోరారు. తెలంగాణ ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, చిన్న పత్రికలు, మీడియాకు ఆర్థిక సాయం అందించడానికి ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య బీమా పథకం రూపొందించాలని వారు కోరారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్నది ఈ నేపథ్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర నివేదికతో శ్వేత పత్రం విడుదల చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల వృత్తి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని, వార్తల సేకరణలో ప్రమాదకర పరిస్థితులు, ఆరోగ్య ప్రమాదాలు, వృత్తి సంబంధిత బెదిరింపులకు గురవుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కాపాడడానికి ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా జర్నలిస్టుల ఆసుపత్రి చికిత్సలు, ప్రమాద బీమా, ఆరోగ్య సంబంధిత సహాయాలు పొంద గలగాలని, జర్నలిస్టుల సురక్షిత భవిష్యత్తు కోసం ఈ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకువెళ్లి అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 29న దీక్షా దివస్.. కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, నవంబర్ 21:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 29వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షాదివాస్ ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో రాష్ట్ర ప్రజలకు ఇది అత్యంత కీలక ఘట్టంగా నిలుస్తుందని అన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి తెలంగాణ రాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందన్నారు.

ఈ దీక్ష యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందని, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసిందని పేర్కొన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజలు చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని చెప్పారు. ఈ నెల 29న కరీంనగర్‌లో జరిగే దీక్షా దివస్‌లో కేటీఆర్ పాల్గొననున్నారు.

అనంతలో విషాదం .. ముగ్గురు సభ్యుల కుటుంబం ఆత్మహత్య ...

అమరావతి, నవంబర్ 21:అనంతపురం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలోని నార్పల మండలం కేంద్రం మెయిన్ బజార్‌లో ఉన్న పెద్దమ్మ సామి గుడి వద్ద ఓ ఇంటిలో దంపతులు కృష్ణ కిషోర్, శిరీష , ఆరు నెలల కుమారుడిడు జయంత్‌కు ఉరివేసి , ఆ తర్వాత వారు కూడా ఆత్మహత్య చేసుకున్నారు. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తలుపులను పగులగొట్టి చూడగా ఇంట్లో వేలాడుతున్న మృతదేహాలను కిందకు దించారు. అనంతరం కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. వారి ఆత్మహత్యకు కారణాలు తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల క్రితమే వారు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమల క్షేత్రం కోసం ఆధ్యాత్మిక ప్రణాళిక వ్యవస్థ : టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి, నవంబర్ 21: తిరుమల దివ్య క్షేత్ర పవిత్రతను పరిరక్షించే కోణంలో ఆధ్యాత్మికతను ప్రతిబింబించే సమగ్ర ప్రణాళిక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) కార్యనిర్వహణాధికారి శ్యామల రావు ప్రకటించారు. గురువారం సాయంత్రం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ వ్యవస్థ అయిదేళ్ల క్రితం నాటి తిరుమల అభివృద్ధి ప్రణాళిక ప్రతిపాదనకు ఆధునిక రూపంలో ఉంటుందని చెప్పారు. తిరుమల విషయంలో తొలి నుంచి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన తరువాత పర్యవేక్షించే విధానం కొరతగా ఉందని గుర్తించామన్నారు. అందుకే నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో కొన్ని నిర్మాణాలు జరిగేందుకు వీలు కలిగినట్టు స్పష్టమైందన్నారు.

మరోవైపు భవిష్యత్తు అవసరాలకు తగిన విధంగా నిర్మాణాత్మకమైన ప్రణాళిక లేకుండా పోయిందన్నారు. 2019లో తిరుపతి అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా చేసిన ప్రయత్నంలో లీ అసోసియేట్ అనే ప్రైవేట్ కన్సల్టెన్సీ ద్వారా తిరుమల కోసం ఒక మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కృషి జరిగిందన్నారు. అయితే ఆ ప్లాన్ గురించి సరైన సమాచారం లేకపోవడంతో ఆనాటి కన్సల్టెన్సీ వారితో సంప్రదించి కొన్ని వివరాలను సేకరించినట్టు తెలిపారు. అందులో చాలావరకు 2017నాటి పరిస్థితులు ప్రతిబింభించే విధంగానే అంశాలు ఉన్నాయన్నారు. కనుక ఆ ప్లాన్ కు ఇప్పటి పరిస్థితికి, వచ్చే 25ఏళ్ల అవసరాలకు తగినవిధంగా ఆధునీకరించి పునర్నిర్మించాలని ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించిందని తెలిపారు.

ఆ నిర్ణయానికి అనుగుణంగా తిరుమల క్షేత్రాన్ని ఆధ్యాత్మికత కోణంలో భావి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేయడానికి సన్నాహాలు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం సంబంధిత రంగంలో నిపుణులైన ఒక సీనియర్ అధికారిని ఎంపిక చేశామని ఆయన ఆధ్వర్యంలో అర్బన్ డెవలప్ మెంట్ ప్లానింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. రాబోయే రెండునెలల్లో ఆ వ్యవస్థ ద్వారా ఒక విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకుని బోర్డులో చర్చించి అమలు చేస్తామని తెలిపారు. మరో ఆరు నెలల్లో ఆ డాక్యుమెంట్ అమలుకు తెచ్చే ముందు, దానిలోని అంశాలపై సమగ్ర అధ్యయనం, సంబంధిత వర్గాలతో సమీక్ష, అభిప్రాయ సేకరణ వంటి చర్యలు ఉంటాయని చెప్పారు. ఇష్టం వచ్చినట్టు చేపట్టిన మఠాల నిర్మాణాలపై చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. ఇంకా మౌలికంగా తిరుమలలో పార్కింగ్ సమస్య, బాలాజీ బస్టాండ్ తరలింపు, వ్యక్తుల పేర్లతో ఉన్న అధితి గృహాల పేర్ల మార్పు, మఠాల, అధితి గృహాల నిర్మాణాల, పరిధుల పున: సమీక్ష, ప్రత్యేక చెత్త నిర్వహణ వ్యవస్థ నిర్మాణం వంటి అంశాలు ఉంటాయని తెలిపారు. చేపట్టిన, చేపట్టే నిర్మాణాలు ఆధ్యాత్మికత ఉట్టి పడేలా ఉండేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

అలిపిరి వద్ద ట్రాన్సిట్ వ్యవస్థ ఏర్పాటుకు అధ్యయనం

అలాగే తిరుమల క్షేత్రం 11మైళ్ళ చదరపు విస్తీర్ణం కలిగి ఉన్నా 1.16 చదరపు మైళ్ళ పరిధి మాత్రమే వినియోగంలో ఉందన్నారు. కనుక పెరిగే భక్తులకు పూర్తి స్థాయిలో అన్ని వసతి సౌకర్యాలు కష్టతరం అవుతోందన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని తిరుపతిలోని అలిపిరి వద్ద భక్తులకు తాత్కాలిక వసతి వ్యవస్థను ఏర్పాటు చేసి సమయానికి దర్శనానికి తిరుమలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలనే అంశం పై అధ్యయనం చేయనున్నట్టు కూడా శ్యామలరావు తెలిపారు.

వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సోదరుడు వాల్య నాయక్ పార్థివదేహానికి ఘననివాళులు

భద్రాద్రికొత్తగూడెం, నవంబర్ 21 (నేటినిజం ప్రతినిధి) :కొత్తగూడెం మండలం కారుకొండ రామవరం గ్రామంలో వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్న వాల్య నాయక్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపిన వైరా నియోజకవర్గ ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, టిపిసిసి సభ్యులు కట్ల రంగారావు, పొదిల హరినాథ్, రాయల పుల్లయ్య, కట్ల సంతోష్, ఇమ్మడి తిరుపతి రావు, మల్లెల నాగేశ్వరరావు, కావూరి శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం గిరిజనుల వ్యతిరేకి - సత్యవతి రాథోడ్

మహబూబాబాద్, నవంబర్ 21: సీఎం రేవంత్ రెడ్డి గిరిజనుల వ్యతిరేకి అని ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ తక్కల్లపల్లి రవీందర్ రావు అన్నారు. గురువారం మహబూబాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. గిరిజనుల ఓట్లతో గెలిచి, వారినే అణచివేస్తున్నాడని మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో గిరిజన రైతులపై దాడి చేసిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా మానుకోటలో ధర్నా నిర్వహిస్తామనగానే సీఎంకు సెగ తగిలిందన్నారు.

అందుకే అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని తెలిపారు. ప్రజా వ్యతిరేక పాలనపై ఊరూరా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ, ఎంపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోతు కవిత, శంకర్ నాయక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటపై అధ్యయనం... జన్నారంలో జర్మనీ ప్రతినిధులు

ఆదిలాబాద్, నవంబర్ 21:జర్మనీ ప్రతినిధులు పత్తి పంటపై అధ్యయనం చేసేందుకు మంచిర్యాల జిల్లా జన్నారంకు వచ్చారు. జన్నారం మండల కేంద్రంలోని హరిత రిసార్టులో జర్మనీ 16మంది ప్రతినిధులు బసచేశారు. జర్మనీ దేశానికి చెందిన 16 మంది ప్రతినిధులు జిల్లాలోని పలు ప్రాంతాల్లోని పత్తి పంటపై అధ్యయనం చేయడానికి వచ్చారు.

వారందరూ స్థానిక హరిత రిసార్ట్ లో బస చేసి బుధవారం ఉదయం ఇక్కడి నుండి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ ప్రాంతానికి వెళ్లారు. ఆ ప్రాంతంలోని పత్తి పంటను పరిశీలించి, ఆ పత్తిని ప్రతినిధులు కొనుగోలు చేసి చెన్నై ద్వారా జర్మనీ దేశానికి తరలించనున్నారు. హరిత రిసార్ట్ సేవల పట్ల ఆ ప్రతినిధులు ప్రశంసించారు. వారందరికీ హరిత రిసార్ట్ మేనేజర్ ఎస్.వీరేంద్రకుమార్ ఉదయం విడ్కోలు పలికారు.

ప్రజా పాలన విజయోత్సవాలపై కళా ప్రదర్శన

మెదక్, నవంబర్ 21:ఆటపాటలతో అవగాహన సారధి కళాకారులు జక్కపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలలో సాంస్కృతిక ప్రదర్శన.ప్రజా పాలన జిల్లా కలెక్టర్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ప్రజాపాలన విజయో త్సవాలలో భాగంగా సర్సాపూర్ మండలం, సర్సాపూర్ , జక్కపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలలో ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమాలు సారధికళాకారులచే పాటలు పాడ టం జరిగింది. గ్రామాలలో ప్రజా పాలన పైన ప్రజలకు అర్థమయ్యే విధంగా ఆటపాటలతో అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఏర్పడి సంవ త్సరం గడిచిన సందర్భం గా ఇప్పటివరకు ప్రజలకు చేరువైన మరియు చేరనున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వాటి ఆవశ్యకతను తెలియజేస్తూ వివరించారు. రాష్ట్రంలో ప్రజా పాలన ప్రజా విజయోత్స వాల కార్యక్రమంలో ప్రజా పాలన కళాయా త్రతో పల్లె పల్లె తిరుగుతూ అవగా హన కల్పిస్తున్నారు, పండుగలా జరుగు తున్న ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేస్తూ పథకాల పైన అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. .. ఈ కార్య క్రమంలో టీం లీడర్ సిద్దులు సాం స్కృతి సారధి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.

-తూకం వేసిన 48 గంటల్లో రైతులకు డబ్బులు అందేలా చూడాలి.

-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి):తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా చూడాలని,ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు.

గురువారం జిన్నారం మండల కేంద్రంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మిక తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ధాన్యం రైతులకు 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యేలా వెంటనే ఆన్లైన్ టాబ్ లోవివరాలు ఫీడ్ చేయాలని కలెక్టర్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు.ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించిన రిజిస్టర్ లను కలెక్టర్ ఈ సందర్భంగా తనిఖీ చేసి, సంబంధిత సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, సన్నధాన్య కు సంబందించిన బోనస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దనే అమ్ముకొని, మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ధాన్యం బస్తాలను తూకం వేసిన వెంటనే ధాన్యం బస్తాల లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, సంబంధిత మిల్లులకు తరలించాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఎటువంటి అలసత్వం వహించరాదన్నారు. ఓపీఎంఎస్ లో రైతు పేరు, ఫోన్ నంబర్, ధాన్యం బస్తాలు, తదితర

కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం జరిపించాలని, రైతులకు ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకొని నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండే విధంగా చూసి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి , జిల్లా పౌరసరఫరాల శాఖ, జి ఏం కొండల్ రావు , అదనపు డి ఆర్ డి ఓ జంగారెడ్డి , తహసీల్దార్ భిక్షపతి , ఏం పి డి ఓ అరుణారెడ్డి , సంబంధిత శాఖల అధికారులు , తదితరులు పాల్గొన్నారు .

సర్వే వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలి

-వేగంగా సర్వే పూర్తి చేయాలి.

-సర్వే పై ప్రజలు అపోహలు పెట్టుకోవద్దు.

-ఎన్యుమరేటర్లు అడిగిన ప్రతి సమాచారాన్ని ప్రజలు అందించాలి.

-జిన్నారం మండల కేంద్రంలో సామాజిక, ఆర్థిక ,విద్య, ఉపాధి ,రాజకీయ, కుటుంబ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి):తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కుటుంబ సర్వే వివరాలలో తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు.

గురువారం మండల కేంద్రమైన జిన్నారంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లతో మాట్లాడి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పై ప్రజలు అపోహలు పెట్టుకోకుండా సర్వే సిబ్బంది అడిగిన ప్రతి సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.

సర్వేలో తీసుకున్న వివరాలు గోప్యం గా ఉంటాయని ప్రతి అంశాన్ని కోడుల రూపంలో రాస్తున్నందున సర్వేకు పూర్తిస్థాయి భద్రత ఉంటుందన్నారు. సర్వే పై ప్రజలు అపోహలు పెట్టుకోవదన్నారు. సర్వే సిబ్బంది కి పూర్తిస్థాయిలో ప్రజలు సహకరించి వారు అడిగిన వివరాలు అందజేయాలని సూచించారు. సూపర్వైజర్లు రూట్ అధికారులు సర్వే పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే సిబ్బందికి వచ్చే అనుమానాలను వెంటవెంటనే సూపర్వైజర్లు అధికారులు నివృత్తి చేసి కచ్చితత్వంతో కూడిన సర్వే జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి , ఏం పి డి ఓ అరుణారెడ్డి , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

బీసీ నాయకులంతా ఏకమై చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు సాధించాలి

-బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుపు

హైదరాబాద్ నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్); బీసీ నాయకులంతా ఏకమై చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు సాధించాలని పిలుపునిచ్చారు. బీసీ భవనంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా బలపడినప్పుడే అనుకున్న రిజర్వే షన్లను పొందుతాం అన్నారు. అనంతరం గుజ్జసత్యం బర్త్ డే సందర్భంగా ప్రముఖ గాయకులు రూపొందించిన ఆల్బమ్ను విడుదల చేశారు.

బీసీ సంక్షేమ సంగం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గొరిగ మల్లేష్ వేముల రామకృష్ణ అంజి పగిల సతీష్ , పృథ్వి, సురేష్ సూర్యనారాయణ ఆర్య , నరేందర్, ఉదయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ఖమ్మం నవంబర్ 21: లగచర్ల ఫార్మా కంపెనీలో భూములు కోల్పోయి, అక్రమ కేసులో ఇరుక్కున్న బాధితులకు సంఘీభావంగా ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించింది. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. భూసేకరణ పేరుతో బలవంతంగా గిరిజన రైతుల భూములు లాక్కోడానికి తప్పు పట్టింది.

ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్ నుంచి జడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దురాజ రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, గిరిజన రైతులు పాల్గొన్నారు.

దోపిడీ పాలక వర్గాలకు వెతిరేకంగా ప్రజా ఉద్యమాలు

- సీపీఐ(యం ఎల్) చంద్రు పుల్లారెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్

సంగారెడ్డి నవంబర్ 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్); దోపిడీ దళారి కాషాయ బ్రాహ్మణీయ పాలక వర్గాలకు వ్యేతి రేకంగా ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సీపీఐ(యం ఎల్) చంద్రు పుల్లారెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ పిలుపు నిచ్చారు. భూమి భుక్తి పీడిత ప్రజల విముక్తి పోరాటం రాజ్యం చేత బూటకపు ఎన్కౌంటర్ లో అశువులు బాసిన అమగార వీరులకు విప్లవ జోహార్లు అర్పిస్తూ ఆయన మాట్లాడుతూ గోదావరిలో ప్రతిఘటన ఉద్యమ నిర్మాత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40 వ వర్ధంతి సంగారెడ్డి పట్టణంలో జరపడం వల్ల మళ్ళీ విప్లవ ఉద్యమాలకు ఊపిరి పోయడమే అన్నారు, నేడు రాజకీయాలు చేసే వారు, ల్యాండ్ మాఫీయా, హైరెన్ మాఫీయా,వైట్ కలర్ క్రిమర్స్ మాత్రమే అని, పేదల హక్కుల కొరకు పోరాడుతున్న వారిని హార్బన్ నక్సలైట్ పెర్ల మీద జైలో వేస్తూ, అడవి, ఆదివాసీలకు అండగా ఉన్న మావోయిస్టులను అతి కిరాతకంగా కాల్చి చంపుతున్నారు. అడివి ఆదివాసీలను కంది శికులగా మార్చి వేసి పోలీసు కాంట్రెషన్ క్యాంపులో బందిస్తున్నారు, అడివిలో ఉన్న అపారమైన మూడి సరుకు, ఖనిజ నిది నిక్షేపాలు, టాటా, బిర్లా, అంబానీ, అదని, కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు కట్టబెడుతూ ప్రభుత్వాల పాలనా నుండి ప్రజలను దురంచేశారు ప్రజా హక్కుల కోసం విప్లవ సముస్తలు ఉద్యమాలకు సన్నద్ధం కవలనారుఇవ్వు(శ్రామిక స్పందన) జాతీయ కార్యదర్శి షేక్ శవాలి మాట్లాడుతూ కార్మిక, కర్షక, రైతు రంగాల చట్టాలను ఎత్తి వేసేందుకు బీజేపీ ప్రభుత్వం అధికారికంగా చట్టాలను ప్రకటించారు వీటికి వ్యతి రేకంగా కార్మిక లోకం ఉద్యమాలకు ముందుకు రావాలన్నా రుభారత రైతు కూలీ సంఘం అధ్యక్షు డు నాకిరేకంటి చిట్టి బాబు మాట్లాడుతూ రైతులు అద్వనా దిన స్థితిలో ఉన్నారు రైతులకు కనీస మద్దతు ధరల కోసం ఢిలి విడులో నెలల కొద్ది ధర్నాలు చేస్తే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదు పైగా రైతులపై అక్రమ కేసులు, రైతులపై కార్లతో తొక్కి చంపారు వీటన్నిటి కి ఐక్య విప్లవ ఉద్యమాలే పరిష్కారం అన్నారుఈ కార్యక్రమం లో పార్టీ నాయకుడు రియజ్, సంపంగి పద్మ, సుశీల, రాం సింగ్, సుభాష్ పాల్గొన్నారు.

సీఎం సభను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

-పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 21: (నేటి నిజం ప్రతినిధి): వేములవాడలో జరిగిన సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంగా సభను విజయవంతం చేసిన ప్రజలకు, పాత్రికేయ మిత్రులకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. వేములవాడ నియోజకవర్గానికి 1000 కోట్ల నిధులను కేటాయించడం, ఈ వేములవాడ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. పది సంవత్సరాల్లో చేయని పనులు పది నెలల్లో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని వారన్నారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినటువంటి ప్రతి ఒక్క పనిని తూచా తప్పకుండా నెరవేస్తున్న పెద్దలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు వేములవాడ పట్టణ ప్రజల తరపున రాజన్న భక్తుల తరపున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కనికరపు రాకేష్, నాయకులు చిలుక రవేష్, కూరగాయల కొమురయ్య, అన్నారం శ్రీనివాస్, పులి రాంబాబు గౌడ్, అబ్దుల్ రజాక్, తంగేళ్ల గణేష్, తోట రాజు, వస్తాది కృష్ణ, ఖమ్మం గణేష్, తోట లహరి, కుతాటి రాజేశం, కొక్కుల రాజు, నాగుల మహేష్, పోతుగంటి వెంకన్న, మర్రిపల్లి రాజు, తదితరులు ఉన్నారు.

ఒకినావా శిక్షకుడు కె వసంత్ కుమార్‌కు డీజీపీ విజయ కుమార్ ప్రశంస

కరీంనగర్, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి) ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ట్రైనర్ కె వసంత్ కుమార్ కు డీజీపీ విజయ కుమార్ ప్రశంసించారు. శుక్రవారం కరీంనగర్ పోలీస్ ట్రేనింగ్ కళాశాలలో పాసింగ్ గత 9 నెలలుగా శిక్షణ పొందుతున్న ట్రేనీ కానిస్టేబుల్లకు పాసింగ్ అవుట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా యాన్ ఆర్మ్ కంబాట్ విభాగములో చక్కని శిక్షణనందించిన కె వసంత్ కుమార్ ను డిజిపి విజయ్ కుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ఒకినావా మార్షల్ ఆర్ట్ అకాడమీ ద్వారా గత 3 దశాబ్దాలుగా తన సేవలందిచిన వసంత్ కుమార్ ను పోలీస్ ట్రేనింగ్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డీఎస్పీ మల్లిఖార్జున్, సిబ్బంది అభినందించారు.

శ్రీ కొమఱ్ఱాజు వెంకట మోహనరావు, పద్మావతీదేవి గార్ల స్మారకంగా

విశాలాక్షి సాహిత్య మాస పత్రిక

మినీ హాస్యకథల పోటీ

నిర్వహిస్తోంది

రూ. 15,000/-ల బహుమతులు

ఒక్కో కథకు రూ.1,000/- చొప్పున 15 కథలకు బహుమతులు

- మూసపోసిన, తిరగరాసిన కథలు కాకుండా అందరినీ ఆకట్టుకొనే నూతన ఒరవడిలో ఉండే కథలకు ప్రాధాన్యత
- డి.టి.పి. అయితే 2 పేజీలు, చేతివ్రాతలో 3 పేజీలు మించరాదు
మంచికథలకు నిడివి విషయంలో కాస్త వెసులుబాటు ఉంటుంది
- ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి
- హామీపత్రం మీద మాత్రమే రచయితల పేర్లు, ఫోన్ నంబర్లు ఉండాలి - కథల మీద రచయితల పేర్లు ఉండరాదు - జిరాక్స్ ప్రతులను పంపరాదు
- ఈ-మెయిల్, వాట్సాప్‌లలో కథలు పంపితే స్వీకరించబడవు - పోస్ట్ లేదా కొరియర్ ద్వారానే పంపాలి

ఇతర దేశాల వారికి మాత్రమే ఈ-మెయిల్‌లో కథలు పంపేందుకు అనుమతి

- బహుమతి పొందిన, సాధారణ ప్రచురణకి స్వీకరించిన కథలు 'విశాలాక్షి' పత్రికలో ప్రచురించటం జరుగుతుంది
- బహుమతి ప్రదానం జనవరి / ఫిబ్రవరిలో జరిగే 'విశాలాక్షి వార్షికోత్సవ సభ' లో చిరుసత్కారంతో జరుగుతుంది

కథలు మాకు చేరవలసిన చివరి తేది: 15-12-2024

రచనలు పంపవలసిన చిరునామా

VISALAKSHI MASA PATHRIKA

D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 9440529785

9989220000 - CLEW INSIGHTS

కన్న తండ్రి కర్కశత్వం.. ఇద్దరు కూతుళ్లను కాలువలో పడేసి తాను దూకి ఆత్మహత్యకు యత్నం

అమరావతి, నవంబర్ 21: ఏపీ లో రెండు జిల్లాలో విషాద ఘటనలు చోటు చేసుకున్నాయి. అనంతపురంలో ఆరునెలల కుమారు డికి ఉరివేసి భార్యభర్తలిద్దరు ఉరివేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చిన కొద్ది గంటల్లోనే పల్నాడు జిల్లాలో మరో ఘటన చోటు చేసుకుంది.

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు కూతుళ్లను కాలువలో పడేసి తాను ఆత్మహత్యకు ప్రయత్నించగా కూతుళ్లు గల్లంతు కాగా తండ్రిని స్థానికులు కాపాడారు. పల్నాడు (ఖజీర్రినిజీటబీ) జిల్లా ముప్పాళ్ల అద్దంకి బ్రాంచి కాలువలో తండ్రి తన ఇద్దరు బాలికలు యామిని(11), కావ్య(7)ను తోసేశాడు.

అనంతరం తాను అదే కాలువలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు తండ్రిని కాపాడగా ఇద్దరు బాలికలు కాలువలో గల్లంతయ్యారు. వీరు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు యత్నించినట్లు సమాచారం.

23న మళ్లీ అల్పపీడనం.. ఏపీలో వర్షాలకు అవకాశం

అమరావతి, నవంబర్ 21:ఈ నెల 23న ఆగ్నేయ బంగాళా ఖాతం లో అల్పపీడనం ఏర్పడనుందని విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. అల్పపీడనం రెండురోజుల్లో వాయుగుండంగా మారే అవకాశముందని తెలిపారు. ఫలితంగా అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, కేరళలో విస్తారంగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు. వర్షాల కారణంగా వ్యవసాయ పనుల్లో రైతులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది-హరీశ్ రావు

సంగారెడ్డి, నవంబర్ 21: సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్ అయ్యారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని సీఎం చేసిన తప్పుడు ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డితెరలేపుతున్నాడని మండిపడ్డారు. గురువారం అందోల్ మండలం మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని నాపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ చేశాడు.

పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర నీదని ధ్వజమెత్తారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా 13 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదని స్పష్టం చేశారు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే ఉన్నాను.నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు రేవంత్ రెడ్డి.. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం. నువ్వు ఎన్ని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రైతుల పక్షాన నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగాడా..అని ప్రశ్నించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో సైతం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మరోపక్క సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రకటించారు. దీని అంతర్యమేమిటి అని నిలదీశారు.

మధ్యలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడికి పోయిందో చెప్పాలన్నారు. రైతులు పండించిన ధాన్యంలో సగం దళారుల పాలయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..దళిత, గిరిజన, అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతున్నది. కంపెనీ నిర్మాణాల కోసం ఆ భూములను తన అవ్వులకు కట్టబెట్టే ప్రయత్నం సీఎం చేస్తున్నాడు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.

ఒకే ఎకరాకు రెండు పాసుపుస్తకాలు.. ఆర్డీవో, తహసీల్దార్ సస్పెండ్

కరీంనగర్, నవంబర్ 21: (నేటినిజం ప్రతినిధి) ఒకే ఎకరాకు రెండు పాసుపుస్తకాలు జారీ చేసిన ఆర్డీవో, తహసీల్దార్ లను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన రైతు కొత్తపల్లి రాజేందర్ రెడ్డి తండ్రి పేరిట ఉన్న సర్వే నెంబర్ 1 లో 1.20 ఎకరాల భూమి ఉంది. ఆ భూమి కి సంబంధించి ఒకే పాసుపుస్తకం ఉండగా, ఆ పాసుపుస్తకం పై ఆ భూమి ఎవరి పేరిట ఉన్నదో తెలుపకుండా